www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Hyderabad - Vijaywada - Delhi - Bengaluru
శుక్రవారం 18, జూలై, 2025 | పేజీలు :12



# హెచ్‌సీఏలో భారీ అక్రమాలు.. కేటీఆర్, కవితపై టీసీఏ ఫిర్యాదు

- **కేటీఆర్, కవితలపై సీఐడీకి ఫిర్యాదు చేసిన తెలంగాణ క్రికెట్ అసోసియేషన్**
- **హెచ్‌సీఏలో అక్రమార్కుల వెనుక కేటీఆర్, కవిత హస్తం ఉందని ఆరోపణలు**
- **సీఐడీ అడిషనల్ డీజీ చారుసిన్హాను కలిసి కంప్లైంట్ చేసిన టీసీఏ**
- **రాజకీయ అండతోనే జగన్‌మోహన్‌రావు హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అయ్యారని ఫిర్యాదు**
- **అధ్యక్షుడిగా గెలిచాక ఈ విజయం కేటీఆర్, కవితదే అని చెప్పిన జగన్‌మోహన్‌రావు**

**టీపీఎన్, తెలంగాణ:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత మరో అక్రమాల కేసులో చిక్కుకున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏలో అక్రమాల వెనుక కేటీఆర్, కవిత హస్తముందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు సీఐడీ డీజీ చారుసిన్హాకు టీసీఏ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి గురువారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో మరికొందరు అక్రమార్కులు ఉన్నారని వారిపైనా విచారణ జరిపించాలని కోరారు. జాన్ మనోజ్, విజయానంద్, పురుషోత్తం అగర్వాల్, సురేందర్ అగర్వాల్, వంకా ప్రతాప్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా జగన్‌మోహన్‌రావు గెలిచిన వెంటనే 'నా విజయం కేటీఆర్, కవిత, హరీష్‌రావుకు అంకితం చేసినట్లు' చెప్పారని టీసీఏ ఫిర్యాదులో పేర్కొంది. బీఆర్ఎస్ హయాంలో పెద్దల అండదండలతో జగన్‌మోహన్‌రావు హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అయ్యారని కంప్లైంట్ చేశారు. క్రికెట్‌కు సంబంధం లేని రాజకీయ నేతల ప్రమేయంపై విచారణ చేయాలని సీఐడీని టీసీఏ అధికారులు కోరారు. హెచ్‌సీఏ అక్రమాల వ్యవహారంపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్.. సీఐడీతో పాటు ఈడీకి కూడా ఫిర్యాదు చేసింది. మనీ లాండర్ కోణం ఉందని విచారణ జరపాలని టీసీఏ ఫిర్యాదులో తెలిపింది. ఇప్పటికే హెచ్‌సీఏ అక్రమాలపై పూర్తి వివరాలు అందజేయాలని ఇటీవల సీఐడీని ఈడీ కోరింది. కోట్ల రూపాయలు అవకతవకలు జరగడంతో మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేయనుంది. ఈ క్రమంలో టీసీఏ ఫిర్యాదు, సీఐడీ ఇచ్చిన వివరాల ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఈసీఐఆర్ నమోదు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అధికార యంత్రాంగం ఈ ఫిర్యాదులకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ చిట్ చాట్..!

## విలన్లు క్లైమాక్స్ లోనే అరెస్ట్ అవుతారని కామెంట్స్..!

- **చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**
- **గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతోందని వెల్లడి**
- **కేసీఆర్‌ను కాపాడేందుకు కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కామెంట్**
- **కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంటో లేక స్లీపింగ్ ప్రెసిండేంటో తెలీదన్న సీఎం**
- **కవితకు ఆమె ఇంట్లోనే విలువ లేదని ఆరోపణలు**
- **బీసీ రిజర్వేషన్లపై మా వ్యూహం మాకుంది: సీఎం**
- **కేటీఆర్ డ్రగ్స్ కేసు, గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతోంది: సీఎం**
- **కేటీఆర్, లోకేష్ మీటింగ్ వెనుక రహస్యం ఏంటని క్వశ్చన్**



**టీపీఎన్, ఢిల్లీ:**

హస్తిన పర్యటన నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలపై ఆయన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి ఢిల్లీకి కాకపోతే.. ఫామ్‌హౌస్‌కు వెళ్లాలా అని రేవంత్ రెడ్డి అన్నారు. పదే పదే సీఎం ఢిల్లీకి వెళ్తున్నారని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న కామెంట్స్‌పై ఆయన ఫైర్ అయ్యారు. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయని తెలిపారు. బనకచర్లపై జలశక్తి సమావేశంలో ఏం జరిగిందో కేంద్రమే చెప్పిందని వెల్లడించారు. కేసీఆర్‌ను కాపాడేందుకు కిషన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అందుకే కాళేశ్వరంతో పాటు ఫోన్ ట్యాపింగ్ కేసులను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కేంద్రప్రభుత్వం ఆధీనంలో ఉంటాయి కాబట్టి కేసీఆర్ ను ఈజీగా సేవ్ చేయొచ్చని కిషన్‌రెడ్డి భావిస్తున్నారని సీఎం హాట్ కామెంట్స్ చేశారు. "గంజాయి బ్యాచ్‌కి నేను భయపడను. భయపడి ఉంటే నేను రేవంత్ రెడ్డి అవుతానా?" అని ఫైర్ అయ్యారు. "బీసీ రిజర్వేషన్లపై మా వ్యూహం మాకుంది. కేటీఆర్ డ్రగ్స్ కేసు, గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతుందన్నారు. విలన్లు క్లైమాక్స్ లోనే అరెస్ట్ అవుతారని " ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏపీ మంత్రి లోకేశ్‌ను కేటీఆర్ రహస్యంగా ఎందుకు కలిశారని ప్రశ్నించారు. అర్ధరాత్రి డిన్నర్ మీట్ పెట్టడం వెనుక రహస్యం ఏంటని నిలదీశారు. కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన చెల్లి కవితే ఒప్పుకోవడం లేదని ఎద్దేవ చేశారు. కవితకు ఆమె ఇంట్లోనే విలువ లేదని ఆరోపించారు. కొడుకు కేటీఆర్‌కు కేసీఆర్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదాన ఇవ్వడం లేదని ఎద్దేవ చేశారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంటో లేక స్లీపింగ్ ప్రెసిండేంటో తనకు తెలియదని సెటైర్లు వేశారు. ముందు కేసీఆర్ కుటుంబమంతా ఒక తాటిపైకి రావాలని.... ఆ తరువాత రాష్ట్ర ప్రజల గురించి ఆలోచించాలని హితవు పలికారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచాణను వేగవంతం చేశామని, త్వరలోనే నిజాలన్నీ బయటకు వస్తాయని అన్నారు. కేసులో విషయంలో తాను అనవసర హడావుడి చేయబోనని.. కానీ, కేంద్రం ఈ విషయంలో తలదూర్చుతూ అడ్డు పడుతోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. తాము అధికారంలోకి వచ్చాకే అరెస్టులు చేస్తున్నామని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కేసీఆర్ కుటుంబాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ రెడ్డి కామెంట్ చేశారు. తనకు ఎవరితో ఎలాంటి శతృత్వాలు, వైరుధ్యాలు లేవన్నారు. కేసీఆర్ కేవలం తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# పునరుత్పాదక ఇంధనానికి తెలంగాణ సహకరించాలి

**సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ**

**టీపీఎన్, తెలంగాణ:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం సహకారం అందించాలని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రతిపాదించిన పునరుత్పాదక ఇంధన (రెన్యూవబుల్ ఎనర్జీ) కార్యక్రమాలపై తెలంగాణ ప్రభుత్వ సహకారం కోరుతూ కోరారు. బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (CPSU)లు, కోల్ ఇండియా లిమిటెడ్ (CIL), నేవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (NLCIL).... తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కుదుర్చుకుని, సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు (PSP), బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (BESS) వంటి కీలకమైన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు వచ్చే మూడేళ్లలో దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్శించనున్నాయన్నారు. తెలంగాణలోని అధిక సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం. గ్రిడ్ స్టెబిలిటీ, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (BESS)ను అభివృద్ధి చేయడం. క్రిటికల్ బ్యాలెన్సింగ్ కెపాసిటీని అందించేందుకు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాల అధ్యయనం, అమలు. ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడానికి, స్థానిక ఆర్థిక ప్రయోజనాలను పెంచడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో లేదా బొగ్గు కంపెనీలు స్వతంత్ర ప్రాతిపదికన జాయింట్ వెంచర్ మోడల్స్ ఏర్పాటు చేయడం. ఈ ప్రతిపాదనలు, ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు కోసం తెలంగాణ ప్రభుత్వం మద్దతు అవసరమని కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు.. బీఆర్ఎస్ సెలైన్స్‌పై కవిత కౌంటర్

- **బీఆర్ఎస్ వాళ్లు నా దారికి రావాల్సిందే: కవిత**

**టీపీఎన్, తెలంగాణ:**

బీఆర్ఎస్ పార్టీపై ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను గులాబీ పార్టీ వ్యతిరేకిస్తోందని అన్నారు. ఆ ఆర్డినెన్స్ కరెక్టే అని అన్నారు. బీఆర్ఎస్ వాళ్ళు ఆర్డినెన్స్ వద్దని చెప్తున్నారని.. అది తప్పు అని వ్యాఖ్యానించారు. కారు పార్టీ నేతలు మెల్లగా తన దారికి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. ఇందుకోసం వారు నాలుగు రోజులు టైం తీసుకుంటారేమో అని అన్నారు. 2018 చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తేవడం సబబే అని రేవంత్ సర్కార్ కు బహిరంగ మద్దతు ప్రకటించారు. న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాతే ఆర్డినెన్స్‌కు తాను సపోర్ట్ చేసినట్లు చెప్పారు. తనపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేతలు స్పందించలేదని అన్నారు. వాళ్లు రియాక్ట్ కాకపోవడం వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానని కవిత హాట్ కామెంట్స్ చేశారు. తన సొంతింటి పార్టీపై సెటైర్లు వేస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని కవిత స్వాగతించింది. బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో బీఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరును కవిత తప్పుబట్టారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు వేగవంతం

**కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సిట్ నోటీసులు**

**టీపీఎన్, తెలంగాణ:**

రాష్ట్రంలో రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని సిట్ అధికారులు విచారిస్తున్నారు. అలాగే గతంలో తమ ఫోన్లు ట్యాపింగ్‌కు గురయ్యాయని వెల్లడించిన పలువురు రాజకీయ నేతల వాంగ్మూలాలను సేకరిస్తున్నారు. తాజాగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 24న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని బండి సంజయ్ స్పష్టం చేశారు. రాజ్ భవన్ పక్కనున్న దిల్ కుష్ అతిథి గృహంలో విచారణ జరుగనుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో తానూ బాధితుడినని, ఈ వ్యవహారంపై తనకు తెలిసిన అన్ని వివరాలను విచారణ బృందానికి తెలియజేస్తానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పలు రాజకీయ నాయకులు,



పాత్రికేయులు, ప్రభుత్వ అధికారుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్న ఆరోపణలపై సిట్ లోతుగా విచారణ చేస్తోంది. ఈ కేసులో మరికొన్ని కీలక అంశాలు వెలుగు చూసే అవకాశాలున్నట్లు సమాచారం.

# రాచకొండ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్ట్ జంట

- **మావోయిస్ట్ పార్టీలకు వరుసగా ఎదురు దెబ్బలు**
- **అనారోగ్య సమస్యలతో లొంగిపోయిన సంజీవ్, దీనా**
- **ఇద్దరిపై చెరో రూ. 20లక్షల రివార్డ్**
- **పరిహారం వారికే అందేలా చేస్తామన్న సీపీ సుధీర్ బాబు**
- **మిగతా అందరూ జనజీవనస్రవంతిలో కలవాలని పిలుపు**

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**



మావోయిస్ట్ పార్టీలకు ఎదురు దెబ్బలు తగులుతున్నాయి.. ఒకపక్కన కగార్ ఆపరేషన్ లో తమ సభ్యులు చనిపోగా, ఉన్న సభ్యులు లొంగిపోవడం మింగుడు పడని వ్యవహారం అయింది. ఆనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులు.. సమస్యలు ఏవైనా తెలంగాణలో మావోయిస్టులు ఒక్కొక్కరుగా జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు. తాజాగా రాచకొండ పోలీసుల ఎదుట ఇద్దరు కీలక మావోయిస్టు నేతలు లొంగిపోయారు. జననాట్య మండలి ఫౌండర్ సంజీవ్, ఆయన భార్య పార్వతి అలియాస్ దీనా పోలీసులకు సరెండర్ అయ్యారు. ఆంధ్ర, తెలంగాణ, దండకారణ్య ప్రాంతంలో ఈ ఇద్దరు మావోయిస్టులు పనిచేస్తున్నారు. గద్దర్‌తో పాటు జననాట్య మండలి వ్యవస్థాపకుడిగా సంజీవ్ ఉన్నారు. అలాగే దండకారణ్యం స్పెషల్ జోనల్ సెక్రెటరీగా కూడా సంజీవ్ పనిచేశారు. సంజీవ్‌తో పాటు ఆయన భార్య దీనా కూడా పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిద్దరిని రాచకొండ సీపీ సుధీర్ బాబు మీడియా ముందు ప్రవేశపెట్టారు.

**సీపీ సుదీర్ బాబు వెల్లడించిన వివరాలు**

నిషేధిత CPI మావోయిస్ట్ పార్టీకి చెందిన మాల సంజీవ్ అలియాస్ లెంగు దాదా (DKSZC సెక్రటేరియట్ మెంబర్)గా ఉన్నారు. ఆయన భార్య పార్వతి అలియాస్ దీనా (స్టేట్ కమిటీ మెంబర్)గా ఉన్నారు.

మాల సంజీవ్ 45 సంవత్సరాలుగా అజ్ఞాతంలో ఉన్నాడు. 62 సంవత్సరాల మాల సంజీవ్ సొంత ఊరు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా యాప్రాల్ ప్రాంతని చెప్పారు. 1980లో CPI (ML) పీపుల్స్ వార్‌లోని జన నాట్య మండలి (JNM)లో గద్దర్ నాయకత్వంలో చేరాడని చెప్పారు. మాల సంజీవ్, గద్దర్ నాయకత్వంలోని JNM బృందంతో కలిసి ఇండియాలో సుమారు 16 రాష్ట్రాల్లో పర్యటించాడు. CPI (ML) పీపుల్స్ వార్ గురించి ప్రచారం చేస్తూ, ప్రజలను ఆకర్షించడానికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాడు.

గతంలో గద్దర్‌కు ముఖ్య అనుచరుడిగా కూడా పనిచేశాడు. 1982లో కరీంనగర్ హుజారాబాద్ కి చెందిన పంజాల సరోజ అలియాస్ విద్య ను వివాహం చేసుకున్నాడు. 2002లో ములుగు జిల్లాలోని అయిలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో విద్య మరణించింది. 1996లో మనుగూరు దళంలో చేరి డివిజన్ కమిటీ సభ్యుడిగా (DVCM) పని చేశాడు. 2001లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా (SCM) పదోన్నతి పొంది ఉత్తర తెలంగాణ ప్రత్యేక జోనల్ కమిటీ (NTSZC) పరిధిలో పనిచేశాడు. అలాగే 2003లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (DKSZC)కి బదిలీ అయ్యి, CNM ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. సంజీవ్, దీనా.. హిందీ, తెలుగు, స్థానిక కోయ భాషలు నేర్చుకుని గిరిజనుల్ని మావోయిస్ట్ పార్టీ వైపు ఆకర్షించేలా చేశారు.

పెరుగుల పార్వతి అలియాస్ దీనా (50 సంవత్సరాలు) స్వస్థలం నాగర్ కర్నూల్ జిల్లా, పదర మండలం, వంకేశ్వరం గ్రామ నివాసి.

దీనా రాష్ట్ర కమిటీ సభ్యురాలు (SCM in DKSZC), చైతన్య నాట్య మంచ్, DKSZC సాంస్కృతిక ఉపసమితి సభ్యురాలు గా కొనసాగారు. 1992లో నల్లమల ప్రాంతంలో CPI (ML) పీపుల్స్ వార్ గ్రూపులోని అప్పర్ ప్లాట్యూ దళంలో చేరింది. ఆ తరువాత1998లో ఏరియా కమిటీ సభ్యురాలిగా (ACM) పదోన్నతి పొంది జన నాట్యమండలి (JNM)లో పనిచేసింది. 2007లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (DKSZC), ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ అయి, అక్కడ చైతన్య నాట్య మంచ్ (CNM) లో చేరింది. 2016లో డివిజన్ కమిటీ సభ్యురాలిగా (DVCM) పదోన్నతి పొంది, DKSZC పరిధిలోని CNMలో సాంస్కృతిక ఉపసమితి సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టింది. 2018లో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా (SCM) పదోన్నతి పొందింది. గతంలో ఎన్నో సార్లు కాల్పులు టైంలో వీరిద్దరూ పోలీసులు నుంచి తప్పించుకున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కారణంగా మావోయిస్టు లు జన జీవన స్రవంతిలో కలుస్తున్నారని మిగిలిన మావోయిస్ట్‌లు జనజీవన స్రవంతిలోకి రావాలి అని కోరుకుంటున్నామని సిపి సుధీర్ బాబు చెప్పారు. లోగిపోయిన వారికి ప్రభుత్వ పరంగా అన్ని పథకాలు ఇస్తాం... వారి పేరు మీద ఉన్న రివార్డ్‌లను వారికే ఇస్తామన్నారు. ప్రస్తుతంసంజీవ్ పై 20 లక్షలు రివార్డ్ ఉండగా, దీన పై 20 లక్షలు రివార్డ్ ఉంది . వారి పేరు పై ఉన్న రివార్డ్ లను తిరిగి వాళ్లకే ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మరోవైపు రెండు రోజుల క్రితం ఆత్రం లచ్చన్న, చౌదరీ అంకు భాయి రామగుండం పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారం వ్యవధిలోనే నలుగురు కీలక నేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. మావోయిస్టు పార్టీని అంత మొందించడమే లక్ష్యంగా 2024, జనవరి నుంచి కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో ఎంతో మంది మావోలు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టు కీలక నేతలు ఒక్కొక్కరిగా నేలరాలుతున్నారు. దీంతో మావోయిస్టు ఉద్యమం బలహీనపడింది. ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల్లో కూడా భయాందోళన నెలకొంది. దీంతో చాలా మంది మావోలు పోలీసుల ఎదుట లొంగిపోతున్న పరిస్థితి. గత ఆరు నెలల్లో వందల సంఖ్యలో మావోస్టులు పోలీసులకు సరెండర్ అయ్యారు. ఆపరేషన్ కగార్ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 85 మంది మావోయిస్టులు హతమయ్యారు. వేల సంఖ్యలో జవాన్లు ఆపరేషన్ కగార్‌లో పాల్గొని మావోయిస్టులను మట్టుబెట్టే పనిలో ఉన్నారు. మావోయిస్టులు ఎటూ తప్పించుకోకుండా చేయడంతో పాటు వారి నివాస స్థావరాలను ధ్వంసం చేస్తున్నారు. వారికి నిలువ నీడ లేకుండా చేయడంతో ఆర్థికంగా, ఆరోగ్య పరంగా కూడా మావోయిస్టులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోతున్న పరిస్థితి ఏర్పడింది.



## తెలంగాణకు ఇంధన రంగంలో కీలక పాత్ర: 'ఉర్జా మంథన్ 2025'లో శ్రీధర్‌బాబు సూచనలు

**టీపీఎన్, న్యూఢిల్లీ:**

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని భారత మండపంలో 'ఉర్జా మంథన్ 2025' కార్యక్రమం ఘనంగా జరిగింది. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల నుంచి మంత్రులు హాజరైన ఈ కార్యక్రమంలో భారతదేశ ఇంధన భద్రత, సహకార విధానాలపై విస్తృత చర్చ జరిగింది. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రాతినిధ్యం వహిస్తూ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. భారత్ క్లీన్ ఎనర్జీ లక్ష్యాలను సాధించాలంటే కేంద్రరాష్ట్రాల పరస్పర సహకారం అత్యంత కీలకమని తెలిపారు. తెలంగాణ క్లీన్, గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 కింద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరిస్తూ, బయో ఇంధనాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ), సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) వంటి రంగాల్లో తెలంగాణ చేస్తున్న పురోగతిని హైలైట్ చేశారు. తెలంగాణ తరఫున కేంద్రానికి కీలకమైన ప్రతిపాదనలు చేశారు. ముఖ్యంగా నగర గ్యాస్ పంపిణీ వ్యవస్థను హైదరాబాద్‌తోపాటు ద్వితీయ శ్రేణి పట్టణాలకు విస్తరించాలన్నారు. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ (బీజీఎల్)లో మరిన్ని సీఎన్జీ స్టేషన్లతో పాటు పెట్టుబడులు పెంచాలని సూచించారు. పెరుగుతున్న పారిశ్రామిక అవసరాల దృష్ట్యా రాష్ట్రంలో సీఎన్జీ, ఎల్ఎన్జీ టెర్మినల్స్ ఏర్పాటు కోసం సహ నిధుల వినియోగం అవసరమని చెప్పారు. తెలంగాణలో గణనీయంగా లభ్యమవుతున్న వ్యవసాయ వ్యర్థాల ఆధారంగా సీబీజీ ఉత్పత్తికి పెట్టుబడులు అవసరమని వివరించారు. వ్యవసాయ సంపన్న ప్రాంతాల్లో సీబీజీ యూనిట్లను ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. సాటాట్, నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ వంటి పథకాల కింద ఎంఎస్ఎంఈలు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు కల్పించాలని విన్నవించారు. తూర్పుపశ్చిమ గ్యాస్ పైప్‌లైన్ వెంబడి తెలంగాణ వ్యూహాత్మక స్థానాన్ని ఉపయోగించుకుని రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత పారిశ్రామికతకు మౌలిక సదుపాయాలను విస్తరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో ఇంధన భద్రతకు తెలంగాణ కీలక భాగస్వామిగా నిలుస్తుందని, సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధంగా పని చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. ప్రోయాక్టివ్ విధానాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక సంసిద్ధతతో భారతదేశం క్లీన్ ఎనర్జీ పరివర్తనకు నాయకత్వం వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి కూడా పాల్గొన్నారు.




## హుస్నాబాద్ నియోజకవర్గం ప్లాస్టిక్ రహితంగా మారే దిశగా అడుగులు

- **కోహెడలో స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించిన గవర్నర్**
- **పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు**

**టీపీఎన్, తెలంగాణ:**

హుస్నాబాద్ నియోజవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తన తండ్రి పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2.5 కోట్ల రూపాయలతో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. కోహెడ మండల కేంద్రంలో స్థాపించిన స్టీల్ బ్యాంక్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. అంతకు ముందు వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటిన గవర్నర్, కోహెడ నుంచి వేములవాడకు నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభించారు. హుస్నాబాద్‌ను ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు 276 మండల సమైక్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. శుభకార్యాలు, వేడుకల సమయంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, స్టీల్ సామాగ్రి వినియోగాన్ని తప్పనిసరి చేయనున్నారు. ఈ స్టీల్ బ్యాంకుల ద్వారా ఒకేసారి 74 వేల మందికి అన్నం వడ్డించే సామర్థ్యం కలిగిన ప్లేట్లు, గిన్నెలు, టీ కప్పులు, చెంచాలు, బకెట్లు లాంటి సామాగ్రి అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే 340 హోటళ్లలో 3,400 స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. దీంతో హోటళ్లు నెలకు సగటున రూ. 2,000ల వరకూ ఆదా చేస్తున్నాయని మంత్రి తెలిపారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ.. "ప్లాస్టిక్ రహిత గ్రామాల లక్ష్యంతో మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన ప్రయత్నం పర్యావరణ పరిరక్షణకు గొప్ప ఉదాహరణ" అని ప్రశంసించారు. స్టీల్ బ్యాంకుల ప్రభావం ఐటీ, ఆటోమొబైల్ విప్లవాలకంటే గొప్పదిగా అభివర్ణించారు. గ్రామీణ భారతం అభివృద్ధి చెందాలంటే ఆరోగ్యకరమైన జీవనవిధానాలు అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... ప్లాస్టిక్ వాడకానికి విరామం పెట్టేలా ప్రజల్లో అవగాహన పెంచే బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. కరోనా తరవాత ఆరోగ్యంపై వచ్చిన చైతన్యం నేపథ్యంలో ఇప్పుడు ఈ తరహా కార్యక్రమాలు చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, దానా కిషోర్ మూడు జిల్లాల కలెక్టర్లు హైమావతి, స్నేహ శబరిష్, పమేలా సత్పతి, ఇతర అధికారులు పాల్గొన్నారు

## పోలీసు రాజ్యంగా మారిన తెలంగాణ: దాసోజు శ్రవణ్

**టీపీఎన్, హైదరాబాద్:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు రాజ్యంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించినవారిపై కేసులు, నిరసన తెలిపినవారిపై లాఠీచార్జ్ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అణిచేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పోలీసులను తాబేదారులుగా మార్చుకుని రాజకీయాలకు వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 43 శాతం క్రైమ్ రేట్, 28.9 శాతం అత్యాచారాల సంఖ్య పెరిగిందని, హైదరాబాద్‌లో మాత్రమే క్రైమ్ 41 శాతం పెరిగిందని చెప్పారు. మల్కాజిగిరిలో మైనంపల్లి అనుచరులు బీసీ నేతలపై దాడి చేశారని ఆరోపించారు. ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ధర్నాలు చేస్తే లాఠీచార్జ్ చేస్తారని, సామాన్యులు రీట్వీట్ చేసినా జైలుకెళ్తున్నారని ఆరోపించారు. "హోంశాఖ నడపలేకపోతే రేవంత్ వేరొకరికి అప్పగించాలి" అని సూచించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని వ్యాఖ్యానించారు. కేసులు పెట్టినా పోరాటం ఆగదని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు.

# అమ్మకడుపులో హత్యలు.. లోకం చూడని పసికూనలు

- **జంటనగరాల్లో మళ్లీ పెరుగుతున్న భ్రూణ హత్యలు**
- **విచ్చలవిడిగా అబార్షన్ కిట్స్ అమ్మకాలు**
- **డీసీఏ దాడుల్లో వెలుగు చూసిన విస్తుపోయే నిజాలు**

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**





పెళ్లైన స్త్రీ అమ్మకావలని కోరుకుంటుంది. అందుకోసం చెట్టు పుట్టకు మొక్కుతుంది. కనిపించిన దేవుడికి దండం పెడుతుంది. కానీ ఇప్పుడు కొందరు చేస్తున్న పనులు అమ్మతనానికే మచ్చ తెచ్చేలా మారారు. మత్తు, మైకం కమ్మి.. వీకెండ్ కల్చర్, సహజీవనం.. కో లీవింగ్స్ అంటూ పెళ్ళైన తరువాత కావాల్సిన ముచ్చట ముందే తీర్చుకుంటున్నారు. తప్పు మీద తప్పు చేస్తూ గర్భం దాల్చితే చాలా తేలిగ్గా తీసుకుంటూ సొంతంగా అబార్షన్ చేసుకునే పరిస్థితికి దాపురించారు.
తల్లి గర్భం శిశువు కోసం అత్యంత సురక్షితమైన స్థలం కావాలి. కానీ అదే గర్భం లోపల, ఆ శిశువు జీవితమే నశించే స్థలంగా మారినప్పుడు? శరీరం ఇంకా పూర్తిగా ఆకారంలోకి రాకముందే, హృదయం మెల్లగా కొట్టుకుంటున్న ఆ శిశువు.. ఏ దోషం చేయకుండానే మృత్యువు తలుపు తట్టినప్పుడు నిశ్శబ్ద నొప్పి ఎవరికి వినిపిస్తుంది? మాటలు చెప్పలేని ప్రాణం.. బతకాలని కోరుకుంటున్న చిన్న జీవితాన్ని మధ్యలోనే ఆపేసే క్రూరత్వమే భ్రూణ హత్య. ఇది ఒక్క ప్రాణం నాశనం కాదు.. ఒక అద్భుతమైన భవిష్యత్తుని చీకటిలో కలిపేసే అరాచకం.
ఒకప్పుడు ఆడపిల్ల అని స్కానింగ్ లో తెలిస్తే చాలు అబార్షన్ చేయించిన భర్తలు.. చేయించుకున్న భార్యలు ఉన్నారు. దీనిపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సీరియస్ గా తీసుకుంది. భ్రూణ హత్యలు మా వల్ల కాదాని లోకం చూడని చిన్నారులను కడుపులోనే చంపలేమని చెప్పారు. ప్రభుత్వం కూడా తీవ్రంగా స్పందించింది. భ్రూణ హత్యలు అంటే అబార్షన్ చేసినా, స్కానింగ్ లో ఆడ, మగ లింగ నిర్ధారణ చేసిన చట్టరీత్యా నేరం అంటూ ఆదేశాలు జారీ చేశాయి. రూల్స్ బ్రేక్ చేసే వైద్యులు, ఆస్పత్రులు ఎవరైనా జీవితాంతం జైల్ తప్పదని హెచ్చరించాయి.. ఈ ఆర్డర్స్ తో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో అబార్షన్లు ఆగిపోయాయి. అయితే కొందరు డబ్బు కోసం ఇలాంటి ఘాతుకలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్ష పడేలా చేశారు. అయితే ప్రైవేట్ ఆస్పత్రులు అబార్షన్ చేయడానికి వెనుకడుగు వేయడంతో మార్కెట్ లో కొత్త ట్రెండ్ మొదలైంది. ఇంట్లోనే అబార్షన్ చేసుకునే పద్ధతి వచ్చింది. ఇటీవల డీసీఏ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు చేసిన దాడిలో నమ్మలేని నిజాలు బయట పడ్డాయి. కేవలం జంట నగరాల్లోనే సుమారు 149 మెడికల్ షాపులపై దాడులు చేయగా, అబార్షన్ కిట్స్ అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసింది. గర్భ సంపర్కాన్ని కట్టడి చేసే మిఫెప్రిస్టోన్, మిసోప్రోస్టల్ వంటి మందులు మార్కెట్ లో విచ్చల విడిగా అమ్ముడు పోతున్నాయని తేలింది. ఆయా మెడికల్ షాప్స్ నుంచి డ్రగ్సును పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. మెడికల్ షాప్స్ పై చర్యలకు రంగం సిద్ధం చేశారు. ఇలాంటి ఔషధాలు, కిట్స్ అమ్మడం నేరం. చాలా మంది వ్యాపారులు దీనికి ఇటీవల విపరీతమైన డిమాండ్ ఉండటంతో ఎలాంటి అనుమతులు లేకుండా మెడికల్ షాపులకు సప్లై చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. జంటనగరాల్లోనే 149 షాపుల్లో ఈ కిట్స్ స్వాధీనం చేసుకున్నారు అంటే ఇక రాష్ట్ర వ్యాప్తంగా దీని డిమాండ్ ఎంత ఉందో అర్థం అవుతుంది. ఇలాంటి అనధికార ఔషధాల విక్రయాలపై డీసీఏ సీరియస్ గా ఫోకస్ పెట్టింది. ఇలాంటివి అమ్మిన వ్యాపారులే కాదు మెడికల్ షాప్స్ యజమానులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా సప్లై చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని మెడికల్ షాప్స్ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. అమ్మతనం అనేది గొప్ప వరం అని అలాంటి వరాన్ని తప్పటడుగులతో తలదించుకునేలా చేయవద్దు అని కోరుతున్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: దామోదర్ రాజనర్సింహ

**టీపీఎన్, సంగారెడ్డి:**

రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన వెల్లడించారు. గురువారం సింగూరు ప్రాజెక్ట్ ఎడమ కాలువ ద్వారా అందోల్ నియోజకవర్గంలోని పుల్కల్, చౌటకూర్, ఆందోల్ మండలాల్లో ఖరీఫ్ పంటల సాగు కోసం 100 క్యూసెక్కుల నీటిని మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేకున్నా, సింగూర్ ఎడమ కాలువ ద్వారా ఆయకట్టులోని చెరువులు, కుంటలు నింపేలా నీరు విడుదల చేశాం. రైతులకు సాగునీరు అందించడం వల్ల పంటలు విత్తే పరిస్థితి ఏర్పడింది," అని అన్నారు. నీటి విడుదలపై హర్షం వ్యక్తం చేసిన పలువురు రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు పుల్కల్ మండల కేంద్రంలో మంత్రి విద్యాసంస్థల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అక్కడి కేజీబీవీ పాఠశాల, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని తొందరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని విద్యా కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. విద్యాసంస్థల్లో శానిటేషన్, మౌలిక సదుపాయాల మెరుగుదలపై అధికారులను దృష్టి సారించాలన్నారు. సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.



## లింగ సమానత్వానికి ఆర్థిక స్వాతంత్ర్యమే మార్గం: భట్టి

**టీపీఎన్, హైదరాబాద్:**

నిజాం కళాశాలలో మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లింగ అసమానతల సదస్సులో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఆర్థిక స్వాతంత్రమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్థికంగా మహిళలు స్వయం సమృద్ధిగా మారితేనే లింగ బేధాలు, వివక్షలకు చెక్ పడుతుందని అభిప్రాయపడ్డారు. స్వయం సహాయక సంఘాల శక్తిని ఉపయోగించి 2000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని భట్టి వివరించారు. ఈ ఉత్పత్తి ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనను మరింత బలపరిచే దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే లింగ సమానత్వం సాధ్యమవుతుందని, మహిళలకు సమాన హక్కులు కల్పించాలంటే రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో మహిళలకు లభించిన ఆత్మగౌరవం, లింగ సమానత్వం, వరకట్టు నిషేధం వంటి హక్కులన్నీ బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే సాధ్యమయ్యాయని భట్టి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలి: రాంచందర్‌రావు పిలుపు

**టీపీఎన్, గుర్రం శ్రీకాంత్:**




హైదరాబాద్‌లోని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఇంచార్జులు, రాష్ట్ర స్థాయి నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినా రైతుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలు దగ్గర పడటంతో రాజకీయ లబ్ధి కోసం హడావుడిగా రైతుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన రైతు భరోసాను పూర్తిగా అమలు చేయలేదన్నారు. మొదట రూ.15,000 భరోసా ఇస్తామని చెప్పి దానిని రూ.12,000కి తగ్గించి ప్రస్తుతం కేవలం రూ.6,000 చొప్పునే ఇవ్వడం దారుణమన్నారు. రైతులకు నష్టమిచ్చేలా ధరణిని భూభారతిగా మార్చారని, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్న పరిస్థితి ఉందని అన్నారు. వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం, సాంకేతిక లోపాలు రైతులకు ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. హైకోర్టు సూచనల మేరకు సెప్టెంబరులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులపై జరుగుతున్న ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజల ముందు తీసుకురావాలన్నారు. కేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా పలు పథకాలను అమలు చేస్తోందని, 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచినట్లు తెలిపారు. యూపీఏ హయాంలో యూరియా కొరత తీవ్రంగా ఉండేదని, మోదీ ప్రభుత్వం వచ్చాక నీమ్ కోటెడ్ యూరియా సరఫరా పెరిగిందని గుర్తుచేశారు. కేంద్రం 2024-25 రబీ సీజన్ కోసం అవసరమైన 9.5 లక్షల మెట్రిక్ టన్నులకు బదులుగా 12.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి పంపిందని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. 14 పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ బోనస్ చెల్లించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా, సాయిల్ హెల్త్ కార్డులు, కృషి సించాయీ యోజనల ద్వారా రైతులకు మద్దతు కల్పిస్తున్నట్లు వివరించారు. కానీ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫసల్ బీమా వంటి పథకాల్ని అమలు చేయడం లేదని అన్నారు. గుజరాత్‌లో రైతు ఉద్యమాల నేపథ్యంలో కిసాన్ మోర్చా కీలకంగా పనిచేసిందని, అదే మాదిరిగా తెలంగాణలో కూడా కిసాన్ మోర్చా గ్రామీణ ప్రాంతాల్లో రైతుల సమస్యలపై ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. రైతుల పక్షాన బీజేపీ నిలుస్తుందని, మోదీ ప్రభుత్వం చేపట్టిన పథకాలను గ్రామీణ స్థాయిలో చైతన్యం కల్పిస్తూ ప్రచారం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలను బహిర్గతం చేయాలని పేర్కొన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు.



# బీజేపీ తీర్థం పుచ్చుకున్న ఎంఆర్‌పీఎస్ నేత దైద రవి

**టీపీఎన్, తెలంగాణ:** నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు దైద రవి బీజేపీలో చేరారు. ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమక్షంలో ఆయన కమలం తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. "భారతీయ జనతా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం. మరోకొన్ని రోజుల్లో మరింత పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా నాయకులు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు" అని అన్నారు. రాష్ట్రాన్ని రక్షించాలంటే ప్రజలందరూ బీజేపీలో చేరాల్సిన అవసరం ఉందన్నారు. "బీజేపీతోనే బంగారు తెలంగాణ నిర్మాణం సాధ్యం" అని ఆకాంక్షించారు. మిర్యాలగూడను బీజేపీ కంచుకోటగా మార్చే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కాషాయ జెండా ఎగురవేసేలా కృషి చేయాలని రాంచందర్‌రావు పిలుపునిచ్చారు.



# బీఆర్ఎస్ తాకట్టు పెట్టిన నీటి వాటా తిరిగి తెస్తాం: టీపీసీసీ అధ్యక్షుడు

**టీపీఎన్, తెలంగాణ:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని టీ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నా.. ఆర్థిక నిర్బంధ పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం నిస్వార్థంగా పనిచేస్తోందని తెలిపారు. సోషల్‌మీడియా వేదికగా బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వం మీద బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. నాడు రాష్ట్ర నీటి వాటాను తాకట్టు పెట్టిన ఘనత అప్పుడు మంత్రిగా ఉన్న హరీష్‌రావుదేనని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా బనకచర్ల అంశంపై చర్చకు సవాల్ విసిరితే.. కేటీఆర్ డ్రామాలు ఆడుతున్నారని ఫైర్ అయ్యారు. కేసీఆర్ మాత్రం ఫాం హౌస్ దాటి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నారని వ్యాఖ్యానించారు. బనకచర్ల విషయంలో హరీష్‌రావు తీరుపై ప్రజలు నవ్వుకుంటున్నారని.. అసలు వాస్తవాలను సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే స్పష్టంగా వివరించారని అన్నారు. అయినప్పటికీ హరీష్‌రావు అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అబద్ధాలు ఆడడంలో ఆయన మామ కేసీఆర్‌కంటే మించిపోతున్నారని మండిపడ్డారు బీఆర్ఎస్ నేతలు తాకట్టు పెట్టిన నీటి వాటాను తిరిగి తెచ్చే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టంచేశారు. ఒక్క నీటి బొట్టునైనా వదులుకునే పరిస్థితి కాంగ్రెస్‌కు లేదని తేల్చి చెప్పారు. నాయకుడు అంటే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, కాంగ్రెస్ ఆ విధంగా పని చేస్తోందని మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు.

# చీకటి బాగోతాన్ని కప్పిపుచ్చేందుకు చెత్త రాజకీయాలు..

- **సీఎం రేవంత్‌పై హరీష్‌రావు సంచలన ఆరోపణలు**



**టీపీఎన్, తెలంగాణ:** సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. సీఎం ఢిల్లీలో చేసిన చిట్ చాట్‌పై హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి బాధ్యతతో వ్యవహరించకపోవడమే కాకుండా, అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు.రాష్ట్ర ప్రయోజనాల బదులుగా వ్యక్తిగత విమర్శలు, అసత్య ఆరోపణలు చేస్తున్న సీఎం గార్బేజ్ బ్యాచ్‌తో కలసి పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీ పర్యటనలో రేవంత్ చేసిన వ్యాఖ్యలు మరింత కాలుష్యం పెంచినట్లుగా ఉన్నాయన్నారు. ఢిల్లీలో ఇప్పటికే కాలుష్యం ఎక్కువగా ఉంటే.... ఇప్పుడు సీఎం మాటలతో కూడిన చెత్త కూడా వచ్చిందని విమర్శించారు.
రాష్ట్రానికి మంచి చేసే ప్రయత్నాలు చేయకుండా డ్రగ్స్, గంజాయి, అవినీతి, అక్రమాలకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని హరీష్‌రావు విమర్శించారు. "ముఖ్యమంత్రి అంటే పరిపాలన చేయాలి కానీ బ్యాగులు మోయడం కాదు," రేవంత్ చుట్టూ ఉన్నవారు బ్యాగులు మోసేవాళ్లే అని వ్యాఖ్యానించారు. కేటీఆర్‌ను దూషించడం ద్వారా అసలు విషయాలను మళ్లించడం చూస్తే రేవంత్‌రెడ్డి చీకటి బాగోతాలను కప్పిపుచ్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, కాంగ్రెస్ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులతో బాధపడుతున్నారని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్, కమాండ్ కంట్రోల్ బిల్డింగ్‌ల నుంచే పరిపాలన సాగుతోంది తప్ప ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ముఖ్యమంత్రి పనిచేయడం లేదని హరీష్‌రావు ఆరోపించారు.బనకచర్ల ప్రాజెక్ట్ అంశంపై రేవంత్‌రెడ్డి పూర్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల మంత్రి బనకచర్ల ప్రాజెక్ట్ ఎజెండాలో ఉందని ప్రకటించినప్పటికీ, రేవంత్ మాత్రం అసత్యాలనే ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాత్కాలిక ఒప్పందాల్లో భాగంగా కృష్ణా జలాల్లో తెలంగాణకు ప్రాధాన్యత కల్పించడంలో అప్పటి ప్రభుత్వంతో పాటు తెలంగాణ అధికారుల కృషిని తగ్గించి చూపించడానికి కుట్ర జరుగుతోందన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసుపై బండి సంజయ్ హాట్ కామెంట్స్

- **ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం క్లైమాక్స్‌కు చేరిందని వెల్లడి**
- **రాజకీయ నేతలు, వారి సిబ్బంది ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపణలు**
- **మొట్టమొదట ఫోన్ ట్యాపింగ్‌ను తానే వెలుగులోకి తెచ్చానని వ్యాఖ్య**



**టీపీఎన్, గుర్రం శ్రీకాంత్:** ఫోన్ ట్యాపింగ్ కేసుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం క్లైమాక్స్ కు చేరిందన్నారు. బండి సంజయ్ తోపాటు ఆయన పీఆర్వో పసునూరు మధు, పీఏ బోయినిపల్లి ప్రవీణ్ రావు, మాజీ పీఏ పోగుల తిరుపతికి కూడా నోటీసులు రావడంతో ఘాటుగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని బయట పెట్టింది తానేనని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫోన్లను ట్యాప్ చేస్తున్నారంటూ మొట్టమొదటగా గళం విపించానని చెప్పారు.
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న సమయంలో కేసీఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించానన్నారు. ఈ నేపథ్యలో తనను కట్టడి చేసేందుకు ఫోన్ ట్యాపింగ్ కు ఒడిగట్టిందన్నారు. తనను నేరుగా ఎదుర్కొనే దమ్ములేక కేసీఆర్ ప్రభుత్వం తనతోపాటు తన కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది ఫోన్లు ట్యాప్ చేస్తూ నీచానికి ఒడిగడుతోందని.... 2022లోనే అరోపణలు చేశానని చెప్పారు.
"నాపై టెన్త్ పేపర్ లీక్ అనే తప్పుడు కేసు బనాయించి అర్ధరాత్రి తన నివాసంపై దాడి చేసి అరెస్ట్ చేశారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో 317 జీవోను సవరించాలంటూ చేపట్టిన దీక్ష జరగకుండా నిలువరించేందుకు పోలీసులు శతవిధాలా యత్నించి టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఆఫీసు గేటు బద్దలు కొట్టి, ఆఫీస్ అద్దాలు ధ్వంసం చేశారు" అని చెప్పారు.
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫోన్ ట్యాపింగ్ పై విచారణ చేపడుతున్న సిట్, పోలీస్ వర్గాలు నాడు బండి సంజయ్ చెప్పిందంతా నిజమేనని అంటున్నారు అని తెలిపారు. గత ప్రభుత్వం తన ప్రత్యర్థులతోపాటు జడ్జీలు, సినీ తారల ఫోన్లను కూడా ట్యాప్ చేసిందని ఆరోపించారు. చివరకు బీఆర్ఎస్ నేతల ఫోన్లు కూడా ట్యాప్ కు గురయ్యాయని కామెంట్ చేశారు. లేక్ వ్యూ గెస్ట్ హౌస్ లో మరమ్మతులు కొనసాగుతున్నాయి. దీంతో ఈ నెల 24న రాజ్ భవన్ పక్కనున్న దిల్ కుష్ అతిథి గృహంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ విచారణకు హాజరుకానున్నారు.



# ఏఐసీసీ కీలక బాధ్యతకు చల్లా వంశీచంద్ రెడ్డి

**టీపీఎన్, తెలంగాణ:** కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామక ప్రక్రియకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కొత్త ఇంచార్జిగా చల్లా వంశీచంద్ రెడ్డిని నియమించారు. తెలంగాణకు చెందిన మాజీ శాసనసభ్యుడు వంశీచంద్ రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యుసీ) ప్రత్యేక ఆహ్వానితులుగా సేవలందిస్తున్నారు. ఇప్పుడు డీసీసీల నియామకానికి సంబంధించి దేశవ్యాప్తంగా జరుగుతున్న సమగ్ర ప్రక్రియకు ఆయనను ఇంఛార్జిగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ నియామకం ద్వారా ఏఐసీసీ వంశీచంద్‌పై మరోసారి నమ్మకం వ్యక్తం చేసింది. గతంలో కూడా ఆయన ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న సమయంలో ఆర్గనైజేషన్ విభాగంలో బాధ్యతలు నిర్వర్తించారు. తాజా బాధ్యతలతోపాటు డీసీసీ అధ్యక్షుల నియామకాల్లో నాణ్యతను పరిశీలించడం, వారి పనితీరు, సంస్థాగత నైపుణ్యంపై అధ్యయనం చేయడం వంటి అంశాలను వంశీచంద్ పర్యవేక్షించనున్నారు. వంశీచంద్ రెడ్డికి ఈ కీలక బాధ్యత లభించడంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రేవంత్ రెడ్డి చిట్ చాట్ ఆరోపణలపై కేటీఆర్ కౌంటర్



**టీపీఎన్, తెలంగాణ** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైరయ్యారు. తనపై సీఎం తప్పుడు ఆరోపణలు చేశారని.. అందుకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో సిఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. "రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌ల పేరుతో అబద్ధాలు ఆడుతున్నారు. నాపై చేసిన అసత్య ఆరోపణలపై క్షమాపణ చెప్పాలి. లేదంటే కోర్టులకు లాగుతా. చిట్‌చాట్‌లో నా మీద ఆధారాలు లేని ఆరోపణలు చేయడానికి ఢిల్లీకి వెళ్తున్నాడు. నా మీద డ్రగ్స్ కేసుల్లో దర్యాప్తు జరుగుతోందని చెప్పాడు. రేవంత్ రెడ్డిని నేను సూటిగా అడుగుతున్నా. నా మీద ఏదైనా డ్రగ్స్ కేసు నమోదు అయిందా?. నీ దగ్గర కనీసం ఒక చిన్న రుజువు అయినా ఉందా?. నాకు డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్నట్లు ఏమైనా ఆధారాలు ఉన్నాయా?. దమ్ముంటే వాటిని బయటపెట్టాలని సిఎం రేవంత్ కు సవాల్ చేస్తున్నా. చట్టపరమైన జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి రేవంత్ రెడ్డి ఈ చిట్‌చాట్‌ల ముసుగులో వ్యక్తిత్వ విధ్వంసానికి పాల్పడుతున్నారు" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన:మంత్రి వివేక్



**టీపీఎన్, గుర్రం శ్రీకాంత్:** రాష్ట్రంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కంకణ బద్ధులై కాంగ్రెస్ నేతలు పనిచేస్తున్నారని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. గత టీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఖజానా అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఖజానా ఖాళీగా ఉందన్నారు. గత పాలనలో రాష్ట్రం 60 వేల కోట్ల అప్పుల నుంచి ఎనిమిది లక్షల కోట్ల అప్పులకు చేరిందని అన్నారు. ఈ ఆర్థిక సంక్షోభం మధ్యలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టిందన్నారు. ఉచితంగా మహిళల బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గత పది సంవత్సరాలలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను సరైన స్థాయిలో ఇవ్వలేదని విమర్శించారు. కానీ ఇప్పుడు మెదక్ నియోజకవర్గంలోనే 9,000 ఇండ్లు మంజూరయ్యాయని చెప్పారు.ఇందిరమ్మ ఇండ్లపై కూడా ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, ఖజానా ఖాళీ ఉన్నప్పటికీ సీఎం మాట ప్రకారం ఇండ్లను మంజూరు చేశామని వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబనను దృష్టిలో ఉంచుకుని పావలావడ్డీ, వడ్డీ లేని రుణాల పథకం చేపట్టామని చెప్పారు. ఇది వారి కుటుంబాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. మహిళలకు మహిళ క్యాంటీన్లు, ఎలక్ట్రిక్ బస్సులు, పెట్రోల్ పంపులు వంటివి ఇచ్చి స్వయం ఉపాధికి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 'గరీబీ హటావో' పథకం తీసుకొచ్చిన విధానాన్ని ప్రస్తావిస్తూ.... అదే దారిలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెదక్ ఎంపీ రఘునందరావ్ ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితుడు అని.... కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. రాష్ట్రం నుంచి భారీగా పన్నులు కేంద్రానికి పోతున్నాయన్నారు. అయినప్పటికీ.. రాష్ట్రానికి తగిన నిధులు రావడం లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలును సమీక్షించేందుకు ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారన్నారు. వాటి అమలు తీరుపై సమీక్ష జరగనున్నట్లు వివేక్ వెంకటస్వామి తెలిపారు.




## సైబరాబాద్‌లో అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్: రూ. 17 లక్షలు స్వాధీనం

**టీపీఎన్, హైదరాబాద్:** సైబరాబాద్ పోలీసులు భారీ చోరీ కేసును ఛేదించారు. ATMలలో చోరీలకు పాల్పడుతున్న హర్యానాకు చెందిన అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.17 లక్షల నగదు, గ్యాస్ కట్టింగ్ మెషిన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 8, 9 తేదీల అర్ధరాత్రి సమయంలో జీడిమెట్ల లోని మార్కండేయ నగర్ HDFC బ్యాంకు ATMను లక్ష్యంగా చేసుకొని దుండగులు గ్యాస్ కట్టర్‌ల సహాయంతో ATMని కట్ చేసి రూ.34.71 లక్షలు దోచుకున్నారు. ఈ ఘటనపై బ్యాంకు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా.... బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ నేతృత్వంలో ఏడుసార్లు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించిన పోలీసులు ముఠాకు చెందిన మూడు మంది సభ్యులను గుర్తించి, వారిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన నిందితుల్లో అమీర్ అన్సారీ అనే వ్యక్తి మధ్య ప్రదేశ్‌లో పోక్సో కేసులో జైలు శిక్ష అనుభవించాడు. జైలులోనే యాసిద్ హుస్సేన్, ఎండి అబెద్ లతో పరిచయం ఏర్పడిన అనంతరం ముగ్గురూ కలిసి ముఠా ఏర్పరుచుకొని హైదరాబాద్‌లో ATMలపై దాడులకు ప్లాన్ సిద్ధం చేశారు. దర్యాప్తులో నిందితులపై ఇప్పటికే దేశవ్యాప్తంగా 30కి పైగా ATMలు, హౌస్ బ్రేకింగ్ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. బేగంపేట ప్రకాశ్ నగర్‌లో గ్యాస్ కట్టింగ్ పరికరాలను కొనుగోలు చేసిన ముఠా, టార్గెట్ చేసిన ATMలను గుర్తించి రాత్రిపూట దాడులు చేపడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. ముఠాలో మిగిలిన సభ్యుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



## అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్యలో వృద్ధి

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్)లో 2024-25 సంవత్సరానికి గాను ఫేజ్ IV టైగర్ మానిటరింగ్ విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో అటవీశాఖ తాజా సమాచారం వెల్లడించింది. గత ఏడాదితో పోల్చితే ఈసారి పులుల సంఖ్యలో స్పష్టమైన పెరుగుదల కనిపించింది. 2024-25 మానిటరింగ్‌లో మొత్తం 36 పులులు గుర్తించగా, గత సంవత్సరం ఈ సంఖ్య 33గా నమోదైంది. అందులో పెద్దవయసు పులుల సంఖ్య 26 నుంచి 34కి పెరిగింది. గుర్తించిన పులులలో 20 ఆడ పులులు ఉండడం గమనార్హం. వీటి ద్వారా వచ్చే ఏడాదిలో సుమారు 20 పిల్లలు జన్మించే అవకాశం ఉందని ఏటీఆర్‌కు చెందిన సీనియర్ అధికారి తెలిపారు.ఈ వృద్ధి అమ్రాబాద్‌ను వచ్చే నాలుగు నుంచి ఐదు సంవత్సరాల్లో దేశంలోని అత్యుత్తమ టైగర్ రిజర్వులలో ఒకటిగా మార్చే అవకాశాన్ని కలిగిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. మానిటరింగ్ ప్రక్రియను నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ప్రమాణాల మేరకు అమలు చేశారు. ఇందులో మొత్తం 10 అటవీ పరిధులను నాలుగు విభిన్న బ్లాక్‌లుగా విభజించి డేటా సేకరించారు.2024 డిసెంబర్ 20 నుంచి 2025 మే 15 వరకు 1,594 కెమెరా ట్రాపులు అమర్చి 797 గ్రిడ్‌లలో (ప్రతి గ్రిడ్ రెండు చ.కి.మీ పరిమాణంలో) పులుల కదలికలు నమోదు చేశారు. కెమెరా డేటాతో పాటు పగమార్కులు, మూత్రచిక్కులు, గోపురాలు, చెక్కుట తాళ్లు వంటి పరోక్ష ఆధారాలను కూడా విశ్లేషించారు.పులుల సంఖ్య పెరగడానికి అటవీశాఖ సిబ్బంది, స్థానిక ప్రజల కృషి కీలకంగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణ, అక్రమ వేట నివారణకు తీసుకున్న వ్యూహాత్మక చర్యలు, ప్రాజెక్ట్ టైగర్ కింద కొనసాగుతున్న పర్యావరణ మానిటరింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వలన ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అధికారులు వెల్లడించారు.

## తెలంగాణలో స్వచ్ఛ షహర్‌గా

# గ్రేటర్ హైదరాబాద్ ఎంపిక



**టీపీఎన్, న్యూఢిల్లీ:** తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా గ్రేటర్ హైదరాబాద్ స్వచ్ఛ సర్వేక్షణ్-2024 అవార్డులో విశేష ప్రతిష్ఠను సాధించింది. గురువారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MoHUA) నిర్వహించిన జాతీయ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ చేతుల మీదుగా పురపాలక పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలాంబరితి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అవార్డును స్వీకరించారు. ఈ సర్వేలో 10 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల్లో "వ్యర్థాల రహిత నగరం" (Garbage Free City) కేటగిరీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గ్రేటర్ హైదరాబాద్ 6వ స్థానాన్ని దక్కించుకుంది. అదే సమయంలో 7స్టార్ రేటింగ్ సాధించింది. ఈ విజయంతో దేశవ్యాప్తంగా రాష్ట్రాల కేటగిరీలో స్వచ్ఛమైన నగరంగా గుర్తింపు పొందింది. అదనంగా ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (ODF) వాటర్ ప్లస్ సర్టిఫికెట్‌ను కూడా జీహెచ్ఎంసీ సాధించింది. గత ఏడాది గ్రేటర్ హైదరాబాద్ 9వ స్థానం సాధించి 5స్టార్ హోదాతో సరిపెట్టుకోగా, ఈసారి మెరుగైన ప్రదర్శనతో మరింత ఉన్నతంగా నిలిచింది. అవార్డుల స్వీకరణ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఈ రఘు ప్రసాద్, సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ ఎస్ఈ కోటేశ్వరరావు, ఈఈ శ్రీనివాసరెడ్డి, ఏఎస్బీఎం అధికారిణి యశశ్రీ రెడ్డి, శానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్, కార్మిదర్శి ఊర్మిళ పాల్గొన్నారు.గ్రేటర్ హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (GHMC) స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును సాధించిన సందర్భంగా మేయర్ శ్రీమతి గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత హర్షం వ్యక్తం చేశారు.

గత సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్ 9వ ర్యాంక్‌తో 5 స్టార్ హోదా పొందిందని.. ఈ సంవత్సరం మరింత మెరుగైన పనితీరుతో ఉత్తమ ప్రతిభ కనబరిచి 6వ ర్యాంక్ తో 7 స్టార్ రేటింగ్ పొందడం గ్రేటర్ హైదరాబాద్ పనితీరుకు నిదర్శనంగా నిలిచిందన్నారు. అవార్డ్ రావడంలో కీలక పాత్ర పోషించిన GHMC కమిషనర్, సంబంధిత అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు మేయర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు బాధ్యతను మరింత పెంచిందని, ఈ అవార్డు స్ఫూర్తితో గ్రేటర్ హైదరాబాద్‌ను పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్యకరమైన అంశాల్లో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత తెలిపారు. GHMC యొక్క నిరంతర పరిశుభ్రత కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్మికుల అంకితభావం, పౌరుల సహకారంతో నగరానికి ఈ ప్రత్యేక గుర్తింపు లభించిందని కొనియాడారు.



## మాదాపూర్ సున్నం చెరువు వద్ద హైడ్రా చర్యలకు వ్యతిరేకంగా స్థానికుల ఆందోళన

**టీపీఎన్, హైదరాబాద్:** మాదాపూర్ సున్నం చెరువు వద్ద హైడ్రా సంస్థ చేపట్టిన చెరువు పునరుద్ధరణ పనులపై స్థానికుల నిరసనలు ముదురుతున్నాయి. చెరువు పరిసర ప్రాంతమైన సియేట్ లేఔట్, మారుతినగర్ వాసులు శుక్రవారం ఉదయం చెరువు తీరానికి చేరుకొని కళ్లకు గంతలు కట్టుకొని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్లాట్లలోకి బలవంతంగా వచ్చి పనులు చేపడుతున్న హైడ్రా అధికారుల చర్యలను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ మేరలను పూర్తిగా గుర్తించేందుకు సర్వే పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని ఇప్పటికే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని తుంచి హైడ్రా సంస్థ



పనులు కొనసాగిస్తోందని ఆరోపిస్తున్నారు. తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రైవేట్ భూముల్లోకి చొచ్చుకెళ్లి పనులు చేయడం అన్యాయమని ప్లాట్ల యజమానులు మండిపడ్డారు. హైడ్రా తీరుపై న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.



## HCA నిధుల కుంభకోణం: జగన్‌మోహన్‌రావు సహా ఐదుగురికి సీఐడి కస్టడీ

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA)లో జరిగిన నిధుల దుర్వినియోగం, పత్రాల ఫోర్జరీ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. మల్కాజిగిరి కోర్టు ఆదేశాల మేరకు హెచ్సీఏ అధ్యక్షుడు ఏ. జగన్ మోహన్ రావు సహా ఐదుగురిని తెలంగాణ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడి) గురువారం కస్టడీకి తీసుకుంది. చర్లపల్లి జైలులో ఉన్న నిందితులను పోలీసులు భారీ భద్రత నడుమ సీఐడి కార్యాలయానికి తరలించారు. గురువారం నుంచి ఆరు రోజుల పాటు వారిని విచారించనున్నారు. ఈ కేసులో హెచ్సీఏ జెఎస్ శ్రీనివాసరావు, సీఈఓ సునీల్ కాంతే, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర యాదవ్, అదే క్లబ్ అధ్యక్షురాలు జి. కవిత, హెచ్సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావులను సీఐడి ఇప్పటికే అరెస్ట్ చేసింది. వీరిపై నకిలీ పత్రాల సృష్టి, హక్కుల దుర్వినియోగం, నిధుల అక్రమ వినియోగానికి సంబంధించిన అభియోగాలు ఉన్నాయి.

## ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ఇళ్ల స్థలాలపై ఆక్రమణ కుట్రలపై ఆవేదన



**టీపీఎన్, హైదరాబాద్:** రాయదుర్గం గోపన్‌పల్లిలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని పెన్షనర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవితాంతం ప్రభుత్వానికి సేవలు అందించి పైసా పైసా కూడగట్టిన డబ్బుతో స్థలాన్ని కొనుగోలు చేసి స్వంతింటి కల నెరవేర్చుకునేందుకు ప్రయత్నిస్తే, కొందరు వ్యక్తులు దానిపై కన్నేసి కుట్రలు పన్నుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురెల్లి బషీర్‌బాగ్‌లో జరిగిన సమావేశంలో స్పందించారు. గోపన్‌పల్లిలో బీటీఎన్‌జీవోస్ హౌసింగ్ సొసైటీకి చెందిన భూమిని ఆక్రమించేందుకు మరో ఓ సొసైటీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 2010లో రాష్ట్ర ప్రభుత్వం ఈ సొసైటీకి 142.11 ఎకరాల భూమిని కేటాయించి, రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. సొసైటీ సభ్యులు రూ.18 కోట్ల వ్యయంతో లేఅవుట్ అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అందులోని 22 ఎకరాల స్థలాన్ని మరో సొసైటీ పేరుతో బెనామీ విధానంలో కాజేయాలని కొందరు యత్నిస్తున్నారని ఆరోపించారు. తమ సొసైటీలో 4వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు సభ్యులుగా ఉండగా, 2600 మందికి ఇప్పటికే ప్లాట్లు కేటాయించామని వెల్లడించారు. 22 ఎకరాల భూమిపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని, న్యాయపరంగా పోరాడతామని స్పష్టం చేశారు. తమకు కేటాయించిన మొత్తం 142.11 ఎకరాల భూమిని పూర్తి స్థాయిలో కాపాడాల్సిందిగా సీఎం, డిప్యూటీ సీఎంలు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# హెచ్‌సీఏ వ్యవహారంలో తలదూర్చిన ఉప్పల్ సీఐపై సస్పెన్షన్ వేటు

- **హెచ్‌సీఏ స్కామ్‌లో తలదూర్చిన ఎలక్షన్ రెడ్డి**
- **హెచ్‌సీఏ జనరల్ సెక్రటరీ దేవరాజు అరెస్ట్‌కు రంగం సిద్ధం చేసిన CID**
- **సీఐడీ సమాచారాన్ని ముందుగానే దేవరాజుకు చెప్పిన ఎలక్షన్ రెడ్డి**
- **సమాచారం లీక్ చేసినందుకు సీఐపై సస్పెన్షన్ వేటు**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) లో నిధుల అవకతవకల కేసులో కీలక మలుపు తిరిగింది. HCA వ్యవహారంలో సంబంధం లేకపోయినా తలదూర్చిన ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఎలక్షన్‌రెడ్డిపై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. దేవరాజ్ అనే నిందితుడికి కీలక సమాచారం లీక్ చేసినట్లు ఆరోపణలు రావడంతో ఆయనపై ఈ చర్య తీసుకున్నారు. CID దర్యాప్తులో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, సెక్రటరీ దేవరాజ్, ట్రెజరర్ జగన్నాథ్ శ్రీనివాస్ రావు, సీఈవో సునీల్ కుమార్, శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, అతని భార్య కవితలపై కేసులు నమోదు చేశారు. వీరిలో దేవరాజ్ తప్ప మిగిలిన నిందితుల్ని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.అయితే, దేవరాజ్ పరార్ కావడానికి ఎలక్షన్‌రెడ్డే కారణమన్న ఆరోపణలు వెల్లడయ్యాయి. సీఐడీ అధికారులు దేవరాజ్ అరెస్ట్‌కు సిద్ధమైన సమయంలో ఆ సమాచారాన్ని ముందుగానే అతనికి ఎలక్షన్‌రెడ్డి లీక్ చేసినట్లు విచారణలో తేలింది. దీంతో దేవరాజ్ పోలీసులకు చిక్కకుండా పారిపోయారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రవర్తనపై తీవ్రంగా స్పందించిన ఉన్నతాధికారులు ఎలక్షన్‌రెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) లో నిధుల అవకతవకల కేసులో కీలక మలుపు తిరిగింది. HCA వ్యవహారంలో సంబంధం లేకపోయినా తలదూర్చిన ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఎలక్షన్‌రెడ్డిపై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. దేవరాజ్ అనే నిందితుడికి కీలక సమాచారం లీక్ చేసినట్టు ఆరోపణలు రావడంతో ఆయనపై ఈ చర్య తీసుకున్నారు.CID దర్యాప్తులో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, సెక్రటరీ దేవరాజ్, ట్రెజరర్ జగన్నాథ్ శ్రీనివాస్ రావు, సీఈవో సునీల్ కుమార్, శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, అతని భార్య కవితలపై కేసులు నమోదు చేశారు. వీరిలో దేవరాజ్ తప్ప మిగిలిన నిందితుల్ని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.అయితే, దేవరాజ్ పరార్ కావడానికి ఎలక్షన్‌రెడ్డే కారణమన్న ఆరోపణలు వెల్లడయ్యాయి. సీఐడీ అధికారులు దేవరాజ్ అరెస్ట్‌కు సిద్ధమైన సమయంలో ఆ సమాచారాన్ని ముందుగానే అతనికి ఎలక్షన్‌రెడ్డి లీక్ చేసినట్లు విచారణలో తేలింది. దీంతో దేవరాజ్ పోలీసులకు చిక్కకుండా పారిపోయారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రవర్తనపై తీవ్రంగా స్పందించిన ఉన్నతాధికారులు ఎలక్షన్‌రెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేశారు.





## మహిళలే వెలుగు.. సమగ్ర అభివృద్ధే లక్ష్యం: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**టీపీఎన్, వికారాబాద్:**

పేదలకు సహాయం చేయాలంటే కేవలం పదవులు మాత్రమే కాకుండా, మంచి మనసు కూడా అవసరమని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. వికారాబాద్ జిల్లా సమీకృత కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాలు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.9.12 కోట్ల వడ్డీ మాఫీ మొత్తాన్ని ఆయన పంపిణీ చేశారు. సమాజంలో సగ భాగమైన మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబాలు, రాష్ట్రం, దేశం మొత్తం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో పాల్గొన్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సాంప్రదాయంలో మహిళలకు ఉన్న ప్రాధాన్యం మరువరాదని, ప్రతి ఇంటికి ఇల్లాలే వెలుగు అని అభిప్రాయపడ్డారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను బట్టి బట్టి అమలు చేస్తున్నట్టు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కి గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళల పేరుమీద ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని స్పీకర్ తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ పంపులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులు మొదలైన వ్యాపారాలు ఏర్పాటు చేస్తోందని వివరించారు. ఇందిరా శక్తి క్యాంటీన్లు, యూనిఫాం కుట్టే పథకాలు మహిళలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చుతున్నాయని వెల్లడించారు.



## ఫోన్‌లపై నిఘా.. ప్రజాస్వామ్యాన్ని మింగేసిన కేసీఆర్ పాలన: తీన్మార్ మల్లన్న

**టీపీఎన్, హైదరాబాద్:**

బీఆర్ఎస్ పాలనలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపులు తిరుగుతోంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్యాన్ని మింగేసే విధంగా టెలిఫోన్‌లు ట్యాప్ చేశారంటూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. తనతో పాటు తన అనుచరుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారన్నారు. 2022 అక్టోబర్ 31వ తేదీ నుండి 2023 అక్టోబర్ 30వ తేదీ వరకు తన వ్యక్తిగత మొబైల్‌ను ట్యాప్ చేశారని చెప్పారు. అనంతరం 2023 జూలై 31వ తేదీ నుంచి మూడు నెలలపాటు మరో ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారన్నారు. "ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నేను పోరాడుతున్నానన్న కారణంతోనే నా ఫోన్‌లు ట్యాప్ చేశారు. మావోయిస్టు సానుభూతిపరుడిగా చిత్రీకరించి నా కదలికలను గమనించేందుకు ట్యాపింగ్‌కు పాల్పడ్డారు" అని విమర్శించారు. "ప్రజల ఫోన్లను ట్యాప్ చేయాల్సిన అవసరం అప్పటి ప్రభుత్వానికి ఏమి వచ్చింది..? ఫ్యామిలీ మెంబెర్స్ ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఇది తీవ్రమైన నేరం. ఈ వ్యవహారంలోకి ఎవరైతే జోక్యం చేసుకున్నారో వారందరినీ శిక్షించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. ట్యాపింగ్ కేసులో తన అభిప్రాయాలను సిట్ అధికారులకు వివరించానని తెలిపారు. "కేసీఆర్ ప్రభుత్వం ఇక లేదు కాబట్టి, ఇప్పుడైనా ఈ అంశాలు వెలుగులోకి వస్తున్నాయి" అని మల్లన్న వ్యాఖ్యానించారు.



## జటప్రోలులో సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

**టీపీఎన్, కొల్లాపూర్:**

జటప్రోల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేపట్టింది. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులతో కలిసి ఆయా కార్యక్రమాల అమలుపై మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి జటప్రోలులో 'యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్'కు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. పర్యటనలో భాగంగా ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాలు కూడా నిర్వహించే అవకాశముంది. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌లు, ఎంపీ మల్లు రవి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

# అర్హులైన వారందరికీ ఇండ్లు ఇస్తాం: కవ్వంపల్లి






**టీపీఎన్, గుర్రం శ్రీకాంత్:**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. గురువారం తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మండలానికి రెండు గ్రామ పంచాయతీ భవనాలు, రెండు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. ఇప్పటికే స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేశామని, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రాష్ట్రవ్యాప్తంగా 1,148 అంగన్‌వాడీ భవనాలు, 1,144 గ్రామ పంచాయతీ భవనాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

**మహిళలు జీవన జ్యోతులు కావాలి**

మహిళలు ఆర్థికంగా స్వావలంబులై, సమాజానికి జీవన జ్యోతులవ్వాలని కవ్వంపల్లి సత్యనారాయణ ఆకాంక్షించారు. కొత్తపల్లిలో నిర్వహించిన 'ఇందిర మహిళా శక్తి సంబురాల్లో' పాల్గొన్న ఆయన, మహిళల కోసం ప్రభుత్వం వడ్డీలేని రుణాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతలు, పలు పథకాల ద్వారా ఆర్థిక శక్తిని పెంచుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసం కాకుండా, నిజమైన అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ బాధితుడు బొల్లు శ్రీనివాస్‌కు భరోసా**

కొండపలకల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ ఇంటిని సందర్శించి నిర్మాణ పనులను చూశారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయినప్పటికీ, అర్హత ఆధారంగా శ్రీనివాస్‌కు ఇల్లు మంజూరయిందని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీలకు అతీతంగా 270 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. మానవత్వమే ప్రధానమని చెప్పారు. శ్రీనివాస్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# ఖైదీల ఎస్కార్ట్ వ్యవస్థపై సమీక్ష:

## మెరుగుదలకు కీలక ఆదేశాలు జారీ చేసిన ADGP మహేష్ భగవత్

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**



రాష్ట్రంలోని ఖైదీల ఉత్పత్తి, ఎస్కార్ట్ వ్యవస్థను సమీక్షించేందుకు డీజీపీ కార్యాలయంలో ఉన్నత స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ADGP (లా అండ్ ఆర్డర్) మహేష్ ఎం భగవత్ IPS, ఖైదీల ఎస్కార్ట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు పలు కీలక ఆదేశాలను జారీ చేశారు. ఖైదీలను 100% ఉత్పత్తి చేసిన యూనిట్లను ప్రత్యేకంగా అభినందించిన ఆయన, ఈ దిశగా అన్ని యూనిట్లు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల అధికారులతో సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఎస్కార్ట్ అభ్యర్థనల కోసం రేడియో సందేశాలు కనీసం వారం ముందు పంపించాలని ఆదేశించారు. దీని ద్వారా చివరి నిమిషపు లాజిస్టికల్ సమస్యలను నివారించవచ్చని తెలిపారు. విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంలో భాగంగా, CAR, జైళ్ల శాఖ, కోర్టుల అనుసంధానం తదితర సంబంధిత యూనిట్ల అధికారులతో కలసి ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఖైదీల ప్రొటెక్షన్ తేదీలు, సమయాలు, ఎస్కార్ట్ వివరాలు తదితర అంశాలపై తక్షణ సమాచారాన్ని పంచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. జిల్లా వెలుపల ఎస్కార్ట్‌లలో కొంత తక్కువ శాతం నమోదవుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ప్రతి యూనిట్ ఇదే పట్టుదలతో పని చేయాలని, సామర్థ్యం, విశ్వసనీయతను మెరుగుపరచాలని సూచించారు. ముఖ్యంగా పేరుమోసిన నేరస్థులను కోర్టులకు హాజరుపరుస్తున్న సమయంలో శాంతిభద్రతలు, న్యాయ ప్రక్రియల పునీతతను కాపాడేందుకు శిక్షణ పొందిన, బాధ్యతాయుతమైన సిబ్బందిని ఎస్కార్ట్ విధులకు నియమించాలని స్పష్టం చేశారు. ఖైదీ తప్పించుకునే సంఘటనలపై BNS/IPC 224, 261, 262 సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయాల్సిందిగా అధికారులను గుర్తు చేశారు. ఈ నిబంధనలపై కొత్తగా నియమితులైన అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఖైదీల హాజరును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా న్యాయమూర్తులతో సంప్రదింపులు జరిపేందుకు అధికారులను ఆదేశించారు. రాబోయే గణేష్ పండుగ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మానవశక్తి కొరత ఎదురయ్యే అవకాశముండటంతో, VC ద్వారా ఖైదీల హాజరును పెంపొందించాలని తెలిపారు. ఎక్కడైనా వాహనాలు, డ్రైవర్ల కొరత ఉంటే, తదుపరి సమీక్ష వరకు ఆగకుండా వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఖైదీల భద్రత, చట్టపరమైన గౌరవం, సమర్థత మరియు జవాబుదారీతనం కలిగిన వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సమావేశం ద్వారా బలమైన సందేశాన్ని ఇచ్చారు. ఈ సమావేశంలో DCP CAR కార్యాలయానికి చెందిన రక్షిత కె. మూర్తి IPS, AIG (L&O) రమణ కుమార్, జైళ్ల DIG డి. శ్రీనివాస్, SARCPL, CAR ప్రధాన కార్యాలయం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రావిర్యాలలో ఎల్లమ్మ బోనాల ఏర్పాట్లపై సబితా ఇంద్రారెడ్డి సమీక్ష

**టీపీఎన్, రంగారెడ్డి:**

మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాలలో శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవత బోనాల జాతర నిర్వహించనున్నారు. జాతరకు సంబంధించి ఏర్పాట్లపై మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.. అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయం భవిష్యత్తులో ప్రముఖ తీరును సంతరించుకునే స్థాయికి ఎదగనుందన్నారు. అందుకు అనుగుణంగా బోనాల సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రత్యేకంగా అధికారులను చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడం, తాగునీటి సరఫరా బలోపేతం, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం, ప్రధాన మార్గాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, భక్తుల రాకపోకలకు అనుకూలంగా పార్కింగ్ సౌకర్యం కల్పించడం, భద్రతా పరంగా పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ వాణి, శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ చైర్మన్ రెడ్డిగల్ల రత్నం, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగం AE, మున్సిపల్ DE, AEలు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**


ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. సొసైటీ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారంటూ రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్యపై 2016లో అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలంటూ 2020లో రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గత నెల 20న వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు, ఈరోజు ఉత్తర్వులు వెలువరించింది. ఘటన జరిగిన సమయంలో రేవంత్ రెడ్డి అక్కడ లేరని తేలినట్లు తెలిపింది. ఫిర్యాదుదారు చేసిన ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని స్పష్టం చేసింది.



# ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా చెక్కుల పంపిణీ

**టీపీఎన్, శామీర్‌పేట్:**

మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కీలకమైన అడుగులు వేస్తోందని పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లాలోని అలియాబాద్ మున్సిపల్ పరిధిలో జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద లబ్ధిదారులకు చెందిన 619 ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రూ.38.86 కోట్లు, 3,698 గ్రామ సంఘాలకు రూ.1.79 కోట్లు, 5 మంది మహిళలకు లోన్ భీమా కింద రూ.3.19 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డితో కలిసి పట్నం మహేందర్‌రెడ్డి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం శిక్షణ, ఉపాధి, స్వావలంబనకు అనువైన చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయ రంగంలో గేదెలు, కోళ్ల, చేపల పెంపకం, డెయిరీ నిర్వహణతో పాటు పారిశ్రామిక రంగంలో ఆర్టీసీ బస్సుల కొనుగోలు, పెట్రోలు పంపుల నిర్వహణ వంటి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ఐదు మండల సమాఖ్యల పరిధిలో 118 గ్రామ సమాఖ్యలు, 3,495 ఎస్‌హెచ్‌జీల్లో మొత్తం 39,642 లబ్ధిదారులకు బ్యాంక్ లింకేజ్ ద్వారా వడ్డీ లేని రుణాల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,794 సంఘాలకు రూ.220.68 కోట్లు విడుదల చేశామని, జూలై నాటికి 619 సంఘాలకు రూ.39 కోట్ల రుణాలను మంజూరు చేశామని వెల్లడించారు. 2023-25 మధ్యకాలంలో వడ్డీ రాయితీ కింద 2,911 సంఘాలకు రూ.8.75 కోట్ల వడ్డీ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. అలాగే, స్త్రీనిధి రుణాల కింద 2024-25లో రూ.16.51 కోట్ల రుణాలు అందజేశామని, చిన్న వ్యాపారుల కోసం 1,698 యూనిట్లకు రూ.35 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కోసం చేపట్టిన 697 పనులకు రూ.8.14 కోట్లను మహిళా సంఘాల ద్వారా వెచ్చించామని తెలిపారు. రైతుల కోసం రైతుభరోసా, రుణమాఫీ, ఎరువుల పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయాన్ని పండుగలా మార్చామని తెలిపారు.



# ఎబిలిజం vs ప్రత్యేక అవసరాలు

## విద్యలో విధాన సవాళ్లు మరియు సామాజిక తప్పిదాలు..!


ఎబిలిజం vs ప్రత్యేక అవసరాలు : "ఏబిలిజం" మరియు "ప్రత్యేక అవసరాలు" అనే పదాలు రెండు వేర్వేరు కానీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగిన భావనలను సూచిస్తాయి, ఇవి వ్యక్తుల అనుభవాలను ప్రపంచవ్యాప్తంగా గాఢంగా ప్రభావితం చేస్తాయి, తరచుగా వివక్షకు దారితీస్తాయి. "ప్రత్యేక అవసరాలు" అనేది శారీరక, మానసిక, బౌద్ధిక, లేదా ఇంద్రియ సంబంధిత అవసరాలను సూచిస్తుంది, ఇవి వివిధ అడ్డంకులతో సంకర్షణలో, సమాజంలో పూర్తి భాగస్వామ్యాన్ని అడ్డుకోవచ్చు. ఏబిలిజం అనేది ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులపై వివక్ష మరియు సామాజిక పక్షపాతం, ఇది సాధారణ సామర్థ్యాలు ఉన్నతమైనవి అనే నమ్మకంలో మూలాలు కలిగి ఉంటుంది. ఈ విస్తృత భావజాలం స్పష్టంగా మరియు సూక్ష్మంగా వ్యక్తమవుతుంది, ప్రభుత్వ విధానాలలో ముఖ్యమైన సవాళ్లను సృష్టిస్తూ, ముఖ్యంగా విద్యలో విస్తృతమైన సామాజిక అపోహలను పెంపొందిస్తుంది. నిజంగా సమ్మిళిత మరియు సమాన సమాజాలను నిర్మించడానికి ఈ సమస్యలను పరిష్కరించడం చాలా కీలకం.



ఏబిలిజం యొక్క సారాంశం ఏమిటంటే, ప్రత్యేక అవసరాలు లేని వ్యక్తులు ఆదర్శ మానవ రూపాన్ని సూచిస్తారని ఊహిస్తుంది, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు "సరిచేయబడాలి" లేదా స్వాభావికంగా "తక్కువ" అని సూచిస్తుంది. ఈ నమ్మకం ప్రతికూల దృక్పథాన్ని కొనసాగిస్తుంది, ప్రత్యేక అవసరాలను "వైకల్యం" అని చిత్రీకరిస్తుంది, ఇది మానవ అనుభవంలో సహజమైన వైవిధ్యం కాకుండా లోపంగా భావిస్తుంది. ఏబిలిజం బెదిరింపు వంటి శత్రుత్వ చర్యల నుండి, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులను హానిచేసే కానీ దయగల దృక్పథాల వరకు విస్తరిస్తుంది, వారిని బలహీనులుగా లేదా జాలిపడవలసిన వస్తువులుగా చూస్తుంది. వ్యవస్థాగతంగా, ఇది సామాజిక నిబంధనలు మరియు శక్తి నిర్మాణాలలో ఇమిడి ఉంటుంది, తరచుగా అపశక్తిగా పనిచేస్తుంది, దానిని గుర్తించడం మరియు పరిష్కరించడం సవాలుగా ఉంటుంది. ప్రత్యేక అవసరాలు మరియు సామాజిక సవాళ్లను అర్థం చేసుకోవడానికి సామాజిక నమూనా ఒక కీలకమైన దృక్పథం. వైద్య నమూనా ప్రత్యేక అవసరాలను వ్యక్తిగత లోపంగా చూస్తుంది, కానీ సామాజిక నమూనా సవాళ్లు సామాజిక అడ్డంకుల నుండి ఉత్పన్నమవుతాయని పేర్కొంటుంది. ఈ అడ్డంకులు, వ్యక్తి యొక్క పరిస్థితి కాదు, భాగస్వామ్యాన్ని పరిమితం చేస్తాయి. ఉదాహరణకు, వీల్‌చైర్ ఉపయోగించే వ్యక్తి వారి చలనశీలత వల్ల పరిమితం కాదు, కానీ ర్యాంపులు లేకపోవడం లేదా సులభంగా అందుబాటులో లేని రవాణా వల్ల పరిమితం అవుతారు. ఈ దృక్పథం బాధ్యతను సమాజంపైకి మారుస్తుంది, అడ్డంకులను తొలగించడానికి అనుగుణంగా మార్చడానికి, వ్యక్తులను "వైకల్యం" గలవారిగా లేబుల్ చేయడం కాదు. "వైకల్యం" మరియు "డిసేబుల్" అనే పదాలే సమస్యాత్మకమైనవి; వ్యక్తులను వారు సాధారణంగా చేయలేని పనుల ద్వారా నిర్వచించడం కాకుండా, వారు విభిన్నంగా పనులు చేయగలరని అభినందించి, వారిని "విభిన్న సామర్థ్యం కలిగినవారు"గా గుర్తించాలి.
ప్రభుత్వ విధానాలు, తరచుగా ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నప్పటికీ, వాటి రూపకల్పన మరియు అమలులో ఏబిలిజాన్ని కొనసాగిస్తాయి. సులభంగా అందుబాటులో లేని వాతావరణాలు మరియు పాఠ్యాంశాలను సృష్టించడం మరియు నిర్వహించడం ఒక ప్రధాన సవాలు. పబ్లిక్ ప్రదేశాలు, రవాణా, మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో సార్వత్రిక రూపకల్పనను తప్పనిసరి చేయడంలో విధానాలు తరచుగా విఫలమవుతాయి, దీనివల్ల ర్యాంపులు లేని మెట్లు, అందుబాటులో లేని టాయిలెట్లు, వీడియోలు మరియు చిత్రాలపై ఆడియో వివరణలు లేకపోవడం, లేదా సహాయక సాంకేతికతలతో అనుకూలంగా లేని సంక్లిష్ట ఆన్‌లైన్ సేవలు వంటి భౌతిక అడ్డంకులు ఏర్పడతాయి. ఈ వ్యవస్థాగత పర్యవేక్షణ విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులను అవసరమైన సేవలు, ఉపాధి, మరియు పౌర భాగస్వామ్యం నుండి మినహాయిస్తుంది. చారిత్రాత్మకంగా, విధానాలు యూజెనిక్స్ ఉద్యమం లేదా ఓటు హక్కులను నిరాకరించడం వంటి స్పష్టమైన వివక్షను కలిగి ఉండేవి. నీటిగా, విద్య, ఆరోగ్య సంరక్షణ, మరియు ఉపాధిలో సౌకర్యాలకు తగిన నిధులు లేకపోవడం లేదా ప్రయోజనాలను పొందడానికి సంక్లిష్టమైన బ్యూరోక్రాటిక్ ప్రక్రియల ద్వారా విధానాలు పరోక్షంగా వివక్షను కొనసాగిస్తాయి. అంతేకాక, రాజకీయ కార్యాలయాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం వల్ల వారి ప్రత్యేక దృక్పథాలు తరచుగా విధాన రూపకల్పనలో పట్టించుకోబడవు, ఇది అసమర్థమైన పరిష్కారాలకు దారితీస్తుంది. విద్యలో, పాతబడిన బోర్డులు మరియు పద్ధతులు ఈ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయి. సాంప్రదాయ పెన్‌అండ్‌పేపర్ వ్యవస్థలు, తీక్షణమైన కళ్ళు, చెవులు, మరియు నరాలను డిమాండ్ చేస్తాయి, అనుకూల జ్ఞాన సముపార్జన మరియు వివరణను సమకూర్చడంలో విఫలమవుతాయి. ఇది విభిన్న సామర్థ్యం కలిగిన విద్యార్థులు వృద్ధి చెందడానికి సంఘర్షించే వ్యవస్థను కొనసాగిస్తుంది. గుర్తుంచుకోండి, విరిగిన వ్యక్తులను సరిచేయడం కంటే బలమైన పిల్లలను నిర్మించడం ఎల్లప్పుడూ సులభం, సామాజిక వైఫల్యం మరియు నిరుద్యోగం వల్ల ఈ సమాజాల వృద్ధుల ఆధారపడటం మరియు నైపుణ్యాల కొరతను చూస్తే. విధాన వైఫల్యాలతో సమాంతరంగా, ప్రత్యేక అవసరాల గురించిన విస్తృత సామాజిక తప్పిదాలు సవాళ్లను గణనీయంగా తీవ్రతరం చేస్తాయి. ఇది హానికరమైన స్టీరియోటైప్‌లలో వ్యక్తమవుతుంది: ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు శాశ్వతంగా ఆధారపడేవారు, సామాజిక భారం, లేదా విషాద వ్యక్తులుగా చూడబడతారు. దీనికి విరుద్ధంగా, కొందరు రోజువారీ జీవితాన్ని నావిగేట్ చేయడం ద్వారా "ప్రేరణాత్మక" అని చూడబడతారు, దీనిని "ఇన్‌స్పిరేషన్ పోర్న్" అని పిలుస్తారు, ఇది వారి అనుభవాలను ఒక వినోదంగా తగ్గిస్తుంది. ఈ స్టీరియోటైప్‌లు వ్యక్తుల స్వయంప్రతిపత్తిని లాగేస్తాయి, అతిరక్షణ, దయగల దృక్పథాలు, మరియు వారు సంతృప్తమైన జీవితాలను గడపలేరని లేదా ఉత్పాదకంగా ఉండలేరని ఊహించడం వంటి ఫలితాలకు దారితీస్తాయి. సూక్ష్మమైన మాటలు లేదా ప్రవర్తనల ద్వారా వ్యక్తమయ్యే మైక్రోఅగ్రెషన్‌లు, ఏబిలిస్ట్ భాష లేదా ఆక్రమణాత్మక ప్రశ్నలు వంటివి, రోజువారీగా సంచితంగా, మానసిక ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. వ్యక్తులను వారి ప్రత్యేక అవసరాల ద్వారా మాత్రమే నిర్వచించడం, వారి బహుముఖ గుర్తింపులను గుర్తించకపోవడం, సామాజిక బహిష్కరణకు మరింత దోహదం చేస్తుంది. ఏబిలిస్ట్ ప్రభుత్వ విధానాలు మరియు విస్తృత సామాజిక తప్పిదాల యొక్క సంచిత ప్రభావం గాఢమైనది. ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు ఎక్కువ నిరుద్యోగం, పేదరికం, మరియు ఒంటరితనం రేట్లను ఎదుర్కొంటారు. అంధత్వం కలిగిన వ్యక్తులకు ఇది 99% మరియు చెవిటివారికి సమానంగా ఉంటుంది. వారు నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, మరియు సమాజ భాగస్వామ్యానికి గణనీయమైన అడ్డంకులను ఎదుర్కొంటారు.



ఆశ్చర్యకరంగా, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్య కోసం ప్రతి సంవత్సరం వందల కోట్ల రూపాయలు కేటాయించబడతాయి, ఇవి తరచుగా జీతాలు మరియు కార్యక్రమ ఖర్చులలో అదృశ్యమవుతాయి, విద్యా సమానత్వం లేదా శ్రేష్ఠతపై ఏమీ ఫలితం ఇవ్వవు. ఈ నిధులలో ఒక పెద్ద భాగం, సీఎస్ఆర్ నిధులతో సహా, ప్రత్యేక పాఠశాలలను నడిపే ఎన్జీవోలకు వెళ్తుంది, తరచుగా పిల్లలు ఆధారపడే చక్రాన్ని కొనసాగిస్తాయి, టాక్స్‌చెల్లించే పౌరులుగా మారడం కంటే పెన్షన్‌లకు అనుగుణంగా ఉంటాయి. వ్యవస్థాగత అడ్డంకులు మరియు పక్షపాత దృక్పథాలతో నిరంతరం పోరాడటం దీర్ఘకాల ఒత్తిడి, మానసిక ఆరోగ్య సవాళ్లు, మరియు జీవన నాణ్యత తగ్గడానికి దారితీస్తుంది. అంతేకాక, ఈ బహిష్కరణ వల్ల సమాజం నష్టపోతుంది, విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులు అందించే విభిన్న ప్రతిభ, దృక్పథాలు, మరియు సహకారాలను కోల్పోతుంది.
ముగింపుగా, ప్రత్యేక అవసరాలను జీవన అనుభవంగా మరియు ఏబిలిజాన్ని వివక్షాపూరిత భావజాలంగా వేరు చేయడం న్యాయమైన ప్రపంచాన్ని పెంపొందించడానికి పునాదిగా ఉంటుంది. ప్రభుత్వ విధానాలలోని సవాళ్లు——సులభంగా అందుబాటులో లేని మౌలిక సదుపాయాల నుండి వివక్షాపూరిత అభ్యాసాల వరకు——మరియు హానికరమైన స్టీరియోటైప్‌లు మరియు మైక్రోఅగ్రెషన్‌ల ద్వారా కొనసాగించబడే విస్తృత సామాజిక తప్పిదాలు సమిష్టిగా విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తుల పూర్తి సమ్మిళనం మరియు సమానత్వానికి గణనీయమైన అడ్డంకులను సృష్టిస్తాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి సమన్వయ ప్రయత్నం అవసరం: ప్రభుత్వాలు నిజంగా సమ్మిళిత విధానాలను రూపొందించి, కఠినంగా అమలు చేయాలి, సార్వత్రిక అందుబాటు మరియు సమాన అవకాశాలను నిర్ధారించాలి. అదే సమయంలో, సామాజిక దృక్పథాలు జాలి మరియు పక్షపాతం నుండి నిజమైన గౌరవం, అవగాహన, మరియు విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులను విభిన్న, సమర్థ, మరియు మానవ సమాజంలో అంతర్భాగంగా గుర్తించడం వైపు రూపాంతరం చెందాలి. వారి స్వరాలు మరియు అనుభవాలను కేంద్రీకరించడం ద్వారా, మనం ఏబిలిస్ట్ నిర్మాణాలను ధ్వంసం చేసి, అందరికీ నిజంగా అందుబాటులో ఉండే మరియు సమానమైన భవిష్యత్తును నిర్మించవచ్చు.



**రామ్ కమల్, సోషల్ ఇంజినీర్,**
**ఏపీ సమగ్ర విద్య సలహాదారు**

# జర్నలిస్టులు అంటే ఆయుధాలు లేని సైనికులు..!

సైనికుడు అనగానే, శారీరక ఆయుధాలతో సన్నద్ధమై, యుద్ధభూమిలో లేదా సాంకేతికంగా ఏదైనా కారణం కోసం పోరాడే వ్యక్తి మన కళ్ళ ముందు కనిపిస్తాడు. అయితే, విలేఖరి మాత్రం ఆయుధాలతో కాక, జ్ఞానం, పదాలు, మరియు సమాచారం ప్రపంచాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అనే లోతైన అవగాహనతో సన్నద్ధమై ఉంటాడు. అయితే, ఈ సామ్యం ఇంకా లోతుగా ఉంది: సైనికులు మరియు విలేఖరులు ఇద్దరూ తమ రంగాలలో ముందు వరుసలో ఉంటారు——శారీరకంగా మరియు సాంకేతికంగా. సైనికులు ఒక దేశాన్ని లేదా కారణాన్ని రక్షించడానికి పోరాడుతుంటే, విలేఖరులు సత్యం, ప్రజాస్వామ్యం, మరియు సమాచారం యొక్క సమగ్రతను రక్షించడానికి పోరాడతారు.



**సత్యం యొక్క యుద్ధభూమి**

సైనికుడి లక్ష్యం స్పష్టంగా ఉంటుంది: శత్రువును తటస్థీకరించడం, సహచరులను రక్షించడం, మరియు భూభాగాన్ని సురక్షితం చేయడం. విలేఖరి యొక్క లక్ష్యం, అంత స్పష్టంగా కనిపించకపోయినా, ఏ మాత్రం తక్కువ కీలకం కాదు: సత్యాన్ని వెలికితీయడం, అధికారాన్ని బాధ్యతగా ఉంచడం, మరియు ప్రజాలను సమాచారం అందించడం. యుద్ధ ప్రాంతాలలో, విలేఖరులు సైనికుల వలె శారీరక ప్రమాదాలను ఎదుర్కొంటారు, కానీ వారు సేకరించే మరియు పంచే సమాచారం ఖచ్చితమైనది మరియు రాజకీయ అజెండాలు లేదా ప్రచారం ద్వారా కలుషితం కాకుండా ఉండేలా చూసుకోవడం అనే అదనపు సవాలును కూడా ఎదుర్కొంటారు.
రెండు సందర్భాలలోనూ, "యుద్ధభూమి" అధికార పాత్రలను కలిగి ఉంటుంది, మరియు కథనంను నియంత్రించే వారు——ఆయుధాల ద్వారా లేదా పదాల ద్వారా——ఘటనల దిశను రూపొందిస్తారు.

**ప్రభావం యొక్క సాధనాలు**

సైనికులు ప్రత్యక్ష శారీరక సంఘర్షణలో పాల్గొనడానికి ఆయుధాలను ఉపయోగిస్తారు, కానీ విలేఖరులు తమ వృత్తి సాధనాలను——కలం, కెమెరా, మైక్రోఫోన్, మరియు ఇంటర్నెట్——ప్రజల అవగాహనను ప్రభావితం చేయడానికి ఉపయోగిస్తారు. సరైన నివేదిక, సరైన ఫోటో, లేదా సరైన డాక్యుమెంటరీ సామాజిక ఉద్యమాలను రేకెత్తించవచ్చు, ప్రభుత్వాలను కూల్చవచ్చు, లేదా చరిత్ర గతిని మార్చవచ్చు.
ఉదాహరణకు, 1972లోని "నాపామ్ గర్ల్" ఫోటో లేదా పోలీసు హింస యొక్క వీడియో ఫుటేజ్ వంటి చిత్రాలు సైనికులు, రాజకీయ నాయకులు, లేదా మీడియా స్వయంగా కూడా ఊహించని విధంగా ప్రజల అభిప్రాయాన్ని మార్చగలవు. ఈ క్షణాలు, పదాలు మరియు చిత్రాలు స్వయంగా ఆయుధాలుగా ఉంటాయని గుర్తు చేస్తాయి, మరియు విలేఖరులు తరచూ ప్రజాస్పృహ యొక్క ముందు వరుసలో ఉంటారు.

**యుద్ధ బాధితులు**

సైనికులు మరియు విలేఖరులు ఇద్దరూ తమ "యుద్ధాల" లో బాధితులుగా మారవచ్చు. సైనికులు యుద్ధభూమిలో తమ ప్రాణాలను పణంగా పెడతారు; విలేఖరులు, ముఖ్యంగా యుద్ధ ప్రాంతాలలో, జైలు శిక్ష, చిత్రహింసలు, లేదా మరణం వంటి ప్రమాదాలను ఎదుర్కొంటారు. జమాల్ ఖషోగ్గి, డాఫ్నే కరువానా గలిజియా, లేదా మేరీ కోల్విన్ వంటి ప్రముఖ విలేఖరులను గుర్తు చేసుకోండి, వారు సత్యాన్ని చెప్పడానికి తమ జీవితాలను త్యాగం చేశారు.
ఈ "ఆయుధాలు లేని సైనికులు" సైనికుల రక్షణ కవచం కలిగి ఉండకపోవచ్చు, కానీ వారు సత్యాన్ని డాక్యుమెంట్ చేయడానికి అచంచలమైన నిబద్ధతను కలిగి ఉంటారు——గొప్ప వ్యక్తిగత ప్రమాదం ఉన్నప్పటికీ. సైనికులు తమ త్యాగాల కోసం హీరోలుగా కీర్తించబడినట్లే, ఈ ప్రమాదాలను ఎదుర్కొనే విలేఖరులు అణచివేత వ్యవస్థలను సవాలు చేయడంలో లేదా అసౌకర్య సత్యాలను వెల్లడించడంలో వారి ధైర్యం కోసం తరచూ గౌరవించబడతారు.

**నైతిక మరియు ధార్మిక ముందు వరుసలు**

సైనికుడు మరియు విలేఖరి ఇద్దరూ తీసుకోవలసిన నైతిక మరియు ధార్మిక నిర్ణయాలలో కూడా ఈ సామ్యం నిలుస్తుంది. సైనికుడు తన చర్యల యొక్క ఖర్చును ఆలోచించాలి——యుద్ధం యొక్క నైతిక పరిణామాలు ఏమిటి, మరియు ఆత్మరక్షణ ఎప్పుడు దాడిగా మారుతుంది? అదేవిధంగా, విలేఖరి "సత్యాన్ని నివేదించడం యొక్క బాధ్యత ఏమిటి?" అనే నైతిక ప్రశ్నను ఎదుర్కొంటాడు. కేవలం వాస్తవాలను నివేదించడం సరిపోతుందా, లేక అన్యాయాన్ని సవాలు చేయడం, అధికారాన్ని బాధ్యతగా ఉంచడం, మరియు స్వయంగా మాట్లాడలేని వారి కోసం న్యాయవాదిగా మారడం కూడా చేయాలా?

**పెద్ద లక్ష్యం ముఖ్యం**

ఇద్దరూ కష్టమైన పరిస్థితులలో కఠినమైన ఎంపికలను ఎదుర్కొంటారు——అది ట్రిగ్గర్ లాగడం కావచ్చు లేదా జీవితాలను ప్రమాదంలో పడవేసే సున్నితమైన కథనాన్ని ప్రచురించాలా వద్దా అని నిర్ణయించడం కావచ్చు. వస్తునిష్ఠత మరియు కార్యకర్తవాదం మధ్య గీత చాలా సన్నగా ఉంటుంది, కానీ ఇది తరచూ పెద్ద లక్ష్యం కోసం నడవబడుతుంది.


**ప్రతిఘటన మరియు స్థితిస్థాపకత**

ప్రతిఘటన ఉద్యమాలలోని సైనికుల వలె, విలేఖరులు కూడా ఆయుధాలతో నేరుగా పోరాడకపోయినా, మార్పు యొక్క ఏజెంట్లుగా ఉంటారు. అవినీతిని బయటపెట్టే, పర్యావరణ ప్రమాదాలను బహిర్గతం చేసే, లేదా మానవ హక్కుల ఉల్లంఘనలపై దృష్టి తెచ్చే పరిశోధనాత్మక విలేఖరులను గురించి ఆలోచించండి. వారు సవాలు చేసే అధికారాలచే ఎల్లప్పుడూ ప్రశంసించబడరు, మరియు తరచూ ప్రతీకారాన్ని ఎదుర్కొంటారు, అయినప్పటికీ వారి పని ప్రజాస్వామ్య సమాజాల ఆరోగ్యానికి కీలకమైనది.



**విలేఖరులు ఎక్కువ స్వేచ్ఛను అనుభవిస్తారు**

పత్రికా స్వేచ్ఛ బెదిరింపులకు గురవుతున్న దేశాలలో, విలేఖరులు తరచూ వ్యవస్థాగత అణచివేతను ఎదుర్కొంటారు——అధికార శాసన రాజ్యాలలో సైనికులు తాము నమ్మని యుద్ధాలలో పోరాడవలసి వచ్చినట్లే. అయితే, ఈ "ఆయుధాలు లేని సైనికుల" స్థితిస్థాపకత కొన్నిసార్లు ఇంకా శక్తివంతంగా ఉంటుంది, ఎందుకంటే వారు పోరాడడానికి ఉపయోగించే సాధనాలు——కలం, స్వరం, మరియు సత్యం——తీసివేయడం చాలా కష్టం. కాబట్టి, సంక్షిప్తంగా చెప్పాలంటే, "ఆయుధాలు లేని సైనికుడు" అనే సామ్యం, విలేఖరులు సాంప్రదాయ ఆయుధాలతో సన్నద్ధం కాకపోయినా, ధైర్యం, స్థితిస్థాపకత, మరియు తరచూ వ్యక్తిగత త్యాగం అవసరమైన అధికపణంగా యుద్ధంలో పాల్గొంటారని వివరిస్తుంది. వారి శక్తి కథనాలను రూపొందించడంలో, ప్రస్తుత స్థితిని సవాలు చేయడంలో, మరియు చివరికి, చరిత్ర గతిని మార్చడంలో ఉంది.



**సుబ్బారావు, సీనియర్ జర్నలిస్ట్.**

# బీహార్ లో 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

**టీపీఎన్, పాట్నా :**
బీహార్ లో ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో అక్కడి ప్రభుత్వం ప్రజలను ఆకర్షించేందుకు కొత్త పథకాలను ప్రవేశపెడుతోంది. సీఎం నితీష్ కుమార్ బీహార్ వాసులకు వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు 125 యూనిట్ల విద్యుత్ ఉచితంగా సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని మొత్తం 1 కోటి 67 లక్షల కుటుంబాలు ప్రత్యక్ష ప్రయోజనం పొందుతాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ నిర్ణయం వచ్చేనెల ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తుంది తెలిపారు. జులై బిల్లు నుండే వినియోగదారులు ప్రయోజనాలను పొందడం ప్రారంభిస్తారని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని గృహ వినియోగదారులకు 125 యూనిట్ల వరకు విద్యుత్ కోసం ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ట్వీట్ ద్వారా సీఎం నితీష్ తెలియజేశారు. ఈ పథకం ముఖ్యంగా పేద , మధ్యతరగతి కుటుంబాలకు భారీ ప్రయోజనం చేకూరుస్తుందని చెబుతున్నారు. రాబోయే మూడేళ్లలో ఈ గృహ వినియోగదారులందరి ఇళ్ల పైకప్పులపై లేదా సమీపంలోని ప్రజా ప్రదేశాలలో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా వారికి ప్రయోజనాలు



అందించాలని కూడా తాము నిర్ణయించామని నితీష్ కుమార్ అన్నారు.
కుటీర్ జ్యోతి యోజన కింద అత్యంత పేద కుటుంబాలకు సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. మిగిలిన మొత్తానికి ప్రభుత్వం సరైన మద్దతును కూడా అందిస్తుంది. గృహ వినియోగదారులు ఇకపై 125 యూనిట్ల విద్యుత్తును ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల వరకు సౌరశక్తి అందుబాటులో ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ప్రయత్నాల వల్ల విద్యుత్ ఖర్చు తగ్గడమే కాకుండా, రాబోయే మూడేళ్లలో రాష్ట్రానికి దాదాపు 10,000 మెగావాట్ల సౌరశక్తి లభిస్తుందని, దీనివల్ల విద్యుత్ సంక్షోభం చాలా వరకు తొలగిపోతుందని రాష్ట్ర ప్రభుత్వం విశ్వసిస్తోంది.
తాము మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35శాతం రిజర్వేషన్ కల్పిస్తామని నితీష్ ఇటీవల హామి ఇచ్చిన సంగతి తెలిసిందే.



## మెడలో నాగుపాముతో సెల్ఫీ..ఒక్క కాటుతో మృతి

**టీపీఎన్, గుణ :** కత్తి పట్టినవాడు ఆ కత్తికే బలైనట్టు..పాములు పట్టే ఓ వ్యక్తి ఆ పాముకే బలైపోయాడు. మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో పనిచేస్తున్న దీపక్ మహావర్ బైక్ నడుపుతుండగా పాము కాటుకు గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. కొన్నాళ్లుగా ఇళ్లు, పొలాలు, పాఠశాలల్లో ప్రవేశించిన ప్రమాదకరమైన పాములను పట్టేవాడు దీపక్ మహావర్. ఓ ఇంట్లోకి దూరిన నాగుపామును పట్టిన తర్వాత బైక్ పై వెళ్తుండగా తన డిక్కీలోని పామును తీసి మెడకు చుట్టుకుని వీడియో కోసం ఫోజులిచ్చాడు. అది అతని చేతిని కాటేసింది. వెంటనే ఆస్పత్రికి వెళ్లి ట్రీట్మెంట్ తీసుకున్నారు. కానీ ఇంటికి వచ్చిన తర్వాత అర్ధరాత్రి మళ్లీ ఆరోగ్యం విషమించడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు అతను చనిపోయాడు.

## దర్శన్‌కు హైకోర్టు బెయిల్ పై అభ్యంతరం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు


**టీపీఎన్, బెంగళూరు :**
ప్రముఖ కన్నడ నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కేసులో దర్శన్‌కు గత ఏడాది అక్టోబర్‌లో హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వగా, ఆ తర్వాత డిసెంబర్ 13న రెగ్యులర్ బెయిల్ లభించింది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దర్శన్‌కు బెయిల్ ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. వాస్తవానికి హైకోర్టు తన విచక్షణాధికారం ఉపయోగించిన తీరుతో తాము ఏకీభవించలేకపోతున్నామని ధర్మాసనం పేర్కొంది. ఈ వ్యవహారంలో మేమెందుకు జోక్యం చేసుకోకూడదు? అని ప్రశ్నించింది.బెయిల్ రద్దు చేయాలని



రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నారని, కానీ హైకోర్టు ఇచ్చిన తీర్పును మీరు చూసే ఉంటారని దర్శన్ తరపు న్యాయవాది కపిల్ సిబాల్‌ను ఉద్దేశించి జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. అభిమాని రేణుకా స్వామి హత్య కేసులో దర్శన్ నిందితుడిగా ఉన్నారు.

## కేజ్రీవాల్ లక్షల విలువైన ఫోన్లను వినియోగించారు : బీజేపీ

**టీపీఎన్, న్యూఢిల్లీ :**
ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హయాంలో కొనుగోలు చేసిన ఫోన్ల జాబితాను హస్తినలోని బీజేపీ ప్రభుత్వం విడుదల చేసింది. కేజ్రీవాల్ తన పదవీకాలంలో నాలుగు మొబైల్ ఫోన్లు కొనుగోలు చేశారు. వాటిలో అత్యంత ఖరీదైనది రూ. 1 లక్ష 63 వేలు. దీనితో పాటు, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కూడా రూ. 1 లక్ష కంటే ఎక్కువ విలువైన అనేక ఫోన్లను కొనుగోలు చేశారు. కేజ్రీవాల్ 2015లో ముఖ్యమంత్రి అయిన తర్వాత 2015 డిసెంబర్ 1న రూ.81000 విలువైన ఐఫోన్ 6ఎస్ ప్లస్‌ను కొనుగోలు చేశారు. దీని తర్వాత 2017 సెప్టెంబర్ 12న రూ.69000 విలువైన ఐఫోన్ 7 ప్లస్‌ను కొనుగోలు చేశారు. 2020 డిసెంబర్



4న రూ.139900 విలువైన ఐఫోన్ 12 ప్రో మ్యాక్స్‌ను కొనుగోలు చేశారు, చివరకు కేజ్రీవాల్ 2022 జూలై 13న రూ.163900 విలువైన యాక్సెసరీలతో కూడిన ఐఫోన్ 13 ప్రో మ్యాక్స్‌ను కొనుగోలు చేసినట్టు తెలిపింది ఢిల్లీ ప్రభుత్వం.

# అసెంబ్లీలో ఎమ్మెల్యేల డిష్యూం..డిష్యూం..

**టీపీఎన్, ముంబై :**
మహారాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్యే జితేంద్ర అవ్హాద్ , గోపీచంద్ పడాల్కర్ మద్దతుదారులు ఘర్షణ పడ్డారు, కారు ఒకదానికొకటి ఢీ కొనడంతో వివాదం జరిగింది. విధాన భవన్ లాబీలో బిజెపి ఎమ్మెల్యే గోపీచంద్ పడాల్కర్ మరియు ఎన్‌సిపి (శరద్ పవార్ వర్గం) ఎమ్మెల్యే జితేంద్ర అవ్హాద్ మద్దతుదారుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియా పోస్టుల ద్వారా వేగంగా వ్యాప్తి చెందుతోంది.





## ఢిల్లీలో ఆహార పరిశుభ్రతపై కఠిన చర్యలు

**టీపీఎన్, న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో ఆహార పరిశుభ్రదత ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఢిల్లా ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (MCD) ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు 1,000 కి పైగా సంస్థలను సీలు చేసింది. 3,100 కి పైగా సంస్థలకు నోటీసులు జారీ చేసింది.ఆరోగ్య శాఖ యొక్క సబ్‌ఫుడ్ హైజీన్ రైడ్ డ్రైవ్ కింద తీసుకున్న చర్యలో మొత్తం 12 మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాల్లో దీన్ని అమలు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని షాపులకు భారీగా జరిమానాలు విధించింది. దీని ద్వారా రూ. 78 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. మున్సిపల్ కార్పొరేషన్ మాంసం దుకాణాలు, ధాబాలు, రెస్టారెంట్లు, జ్యూస్ కార్నర్లు , స్వీట్ షాపులు సహా మొత్తం 5,040 ప్రదేశాలను తనిఖీ చేసింది. వీటిల్లో 1,029 ప్రాంగణాలు ఆరోగ్య లేదా లైసెన్సింగ్ నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించి సీలు వేశారు. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో, ముఖ్యంగా పాఠశాలలు , మతపరమైన ప్రదేశాల సమీపంలో ఉన్న అక్రమ , అపరిశుభ్రమైన ఆహార దుకాణాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు అధికారులు. ప్రమాదకరమైన ఆహారం వల్ల కలిగే వ్యాధులను నివారించడం , ప్రజలకు సురక్షితమైన ఆహారాన్ని నిర్ధారించడం ఈ చర్య యొక్క లక్ష్యం అని అధికారులు తెలిపారు.



## స్మగ్లింగ్ కేసులో కన్నడ నటికి ఏడాది జైలు శిక్ష..!

**టీపీఎన్, బెంగళూరు :** బంగారం స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యా రావుకు ఏడాదిపాటు జైలు శిక్ష పడింది. విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ చట్టం కింద సలహా బోర్డు జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం శిక్ష మొత్తం కాలానికి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే హక్కును బోర్డు తిరస్కరించింది. ఈ కేసులో రన్యారావుతోపాటు మరో ఇద్దరు నిందితులైన తరుణ్ కొండూరు రాజు, సాహిల్ లకు కూడా ఇదే శిక్ష విధించినట్టు బోర్డు తెలిపింది. అక్రమ రవాణాకు సంబంధించి బలైమన ఆధారాలు ఉన్న నేపథ్యంలో శిక్షాకాలంలో వారు బెయిల్ దరఖాస్తు చేసుకునే అవకాశం లేదని తెలిపింది. ధీంతో ముగ్గురు నిందితులు ఏడాదిపాటు జైల్లోనే ఉండాల్సి ఉంది. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ మార్చి తొలివారంలో రన్యారావు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడింది. ఆమె నుంచి 14.3 కిలోల బంగారాన్ని అధికారులు స్వాదీనం చేసుకుని అరెస్ట్ చేశారు.



## భూ ఒప్పందం కేసులో వాద్రాపై ఈడీ ఛార్జ్

**టీపీఎన్, షికోపూర్ :** హర్యానాలోని షికోపూర్‌లో భూ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చార్జిషీట్ దాఖలు చేసింది. ఒక క్రిమినల్ కేసులో వాద్రాపై దర్యాప్తు సంస్థ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు దాఖలు చేయడం ఇదే మొదటిసారి. ఇప్పటికే ఈ వ్యవహారంలో వాద్రాను మూడురోజుల పాటు ఈడీ విచారణకు పిలిచి ప్రశ్నించింది. ఆయనతో పాటు మరికొందరిపై స్థానిక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వాద్రాకి చెందిన అనుబంధ సంస్థలతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రూ.37.64 కోట్లకు పైగా విలువైన 43 స్థిరాస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తు చేసినట్టు అధికారులు తెలిపారు. గురుగ్రామ్‌లోని హర్యానాలోని మనేసర్‌షికోహ్‌పూర్ (ఇప్పుడు సెక్టార్ 83)లో జరిగిన భూ ఒప్పందం జరిగింది. 2008 ఫిబ్రవరి నాటి ఈ ఒప్పందంలో భాగంగా షికోపూర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి వాద్రా గతంలో డైరెక్టర్‌గా ఉన్న స్కైలైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ రూ. 7.5 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ సమయంలో భూపిందర్ సింగ్ హుడా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది.

# నాకు ఏదైనా జరిగితే వారిద్దరిదే బాధ్యత..!



**టీపీఎన్, పాకిస్తాన్ :**
పాకిస్తాన్ లో రాజకీయాలు రసవత్తరంగా మలుపు తిరుగుతున్నాయి. ఆ దేశ ఆర్మీ చీఫ్ మునీర్, పాక్ ప్రధాని షరీఫ్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్. జైలులో తనకు ఏదైనా జరిగితే, దానికి ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిం మునీర్ బాధ్యత వహిస్తారని ఆయన అన్నారు.ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ఇఇన్సాఫ్ (PTI) ఆగస్టు 5 నుండి దేశ వ్యాప్తంగా భారీ నిరసనను ప్రారంభించబోతోంది. మాజీ ప్రధానిని వెంటనే విడుదల చేయమని షాబాజ్ షరీఫ్ ప్రభుత్వం , సైనిక వ్యవస్థపై ఒత్తిడి తెస్తారు. ఇటీవలి జైలులో నాపై జరుగుతున్న క్రూరత్వం పెరిగిందని ఇమ్రాన్ ఖాన్ సోషల్ మీడియా పోస్ట్ లో పేర్కొన్నారు. తన భార్య బుష్రా బీబీని కూడా అలాగే చూస్తున్నారు. ఆమె సెల్‌లోని టెలివిజన్ కూడా ఆపివేయబడింది. మా ఇద్దరికీ అన్ని ఖైదీలకు ఇచ్చే మానవ మరియు చట్టపరమైన హక్కులు లేకుండా పోయాయి. అసిమ్ మునీర్ ఆదేశాల మేరకు ఒక కల్నల్ మరియు జైలు సూపరింటెండెంట్ పనిచేస్తున్నారని తనకు తెలుసని మాజీ ప్రధాని ఖాన్ పేర్కొన్నారు . జైలులో నాకు ఏదైనా జరిగితే, అసిమ్ మునీర్ ప్రత్యక్షంగా బాధ్యత వహిస్తారని నేను నా పార్టీకి స్పష్టమైన సూచనలు ఇస్తున్నాను.నా జీవితాంతం జైలులో గడపడానికి నేను సిద్ధంగా ఉన్నాను కానీ నియంతకు వ్యతిరేకంగా తలవంచడం అనే ప్రశ్నే లేదని ఆయన అన్నారు. పాకిస్తాన్ ప్రజలకు నా సందేశం ఏమిటంటే, వారు ఎట్టి పరిస్థితుల్లోనూ అణచివేత వ్యవస్థకు తలవంచకూడదు. అటువంటి పరిస్థితిలో, ఇప్పుడు ఈ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైంది.దోషులుగా తేలిన హంతకులు మరియు ఉగ్రవాదులను కూడా మెరుగైన పరిస్థితుల్లో ఉంచుతున్నారని ఆయన అన్నారు. జైలులో ఉన్న ఒక సైనికుడికి VIP ట్రీట్మెంట్ లభిస్తోంది. నన్ను నిరంతరం హింసిస్తున్నారు. కానీ ఏమి జరిగినా, నేను ఎట్టి పరిస్థితుల్లోనూ తలవంచను. ఇమ్రా ఖాన్ ఆగస్టు 2023 నుండి జైలులో ఉన్నారని మీకు తెలియజేద్దాం. అతనిపై అవినీతితో సహా డజనుకు పైగా కేసులు నమోదయ్యాయి.





## నిమిష ప్రియ కేసుపై విదేశాంగ శాఖ
# కీలక వ్యాఖ్యలు

**టీపీఎన్, యెమెన్ :** యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసుపై విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది అత్యంత సున్నితమైన అంశమని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ కేసులో నిమిష ప్రియకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఆమె కుటుంబం కోసం ఒక న్యాయవాదిని నియమించినట్లు ఆయన వెల్లడించారు. కేసు పురోగతి వివరాలను తెలుసుకోవడానికి దౌత్యపరంగా సహాయం అందిస్తున్నామని అన్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేలా స్థానిక అధికారులు, కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. ఈ ప్రయత్నాల ఫలితంగానే ఉరిశిక్ష వాయిదా పడిందని ఆయన గుర్తు చేశారు.



# నెతన్యాహుకు పదవి గండం..?


**టీపీఎన్, ఇజ్రాయెల్ :** ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని ఇజ్రాయెల్ సంకీర్ణ ప్రభుత్వానికి పెద్ద దెబ్బ తగిలింది. ఈ కూటమిలోని కీలక మిత్ర పక్షం షాస్ పార్టీ తన మద్దతును ఉపసంహరించింది. దీంతో ఆయన ప్రభుత్వం మైనారిటీలో పడింది.మతపరమైన సెమినరీలలో చదువుకునేవారికి మ్యాండేటరీ మిలిటరీ సర్వీస్ నుంచి మినహాయించే అవకాశం లేకుండా రూపొందించిన ముసాయిదా బిల్లును వ్యతిరేకిస్తూ షాస్ పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. వీరికి సైన్యం నుంచి మినహాయింపునివ్వడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

# 150 దేశాలపై సుంకాలు: ట్రంప్



**టీపీఎన్, అమెరికా :**
ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలపై విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన నిర్ణయం తీసుకున్నారు. 150కిపైగా దేశాలపై 10 లేదా 15 శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు ఆయా దేశాలకు సుంకాల రేట్లు తెలియజేస్తూ లేఖలు పంపనున్నట్లు వెల్లడించారు. 150కిపైగా దేశాలకు నోటీసులు పంపించనున్నామని, అందులోనే సుంకం రేటు పేర్కొంటామని చెప్పారు. ఈ దేశాలన్నింటికీ ఒకే విధంగా సుంకాలు ఉంటాయని వ్యాఖ్యానించారు. అవన్నీ పెద్ద దేశాలు కాదని, తమతో అంతగా వ్యాపారం చేయవని పేర్కొన్నారు. ఈ సుంకాలు 10 లేదా 15 శాతం ఉంటే అవకాశం ఉందని చెప్పారు.

# అలస్కాలో భారీ భూకంపం..సునామీ హెచ్చరికలు జారీ





**టీపీఎన్, అలస్కా :** అమెరికాలోని అలస్కా తీరంలో భారీ భూకంపం సంభించింది. రిక్టర్ స్కేలుపై 7.3 తీవ్రతగా దీన్ని గుర్తించారు. దీంతో యూఎస్ జియోలాజికల్ సర్వే సునామీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని తెలిపింది. ముందస్తు జాగ్రత్తగా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు అధికారులు. 20 కి.మీ దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. స్యాండ్ పాయింట్ సిటీకి 87 కి.మీ దూరంలో దీన్ని ఏపీసెంటర్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు.



# ఇరాక్‌లో భారీ అగ్ని ప్రమాదం, 50 మంది సజీవ దహనం

**టీపీఎన్, ఇరాక్ :** తూర్పు ఇరాక్‌లోని కుట్ నగరంలోని ఓ హైపర్ మార్కెట్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటలు బిల్డింగ్ మొత్తం వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కనీసం 50 మంది చనిపోయినట్టు ప్రావిన్స్ గవర్నర్‌ను ఉటంకిస్తూ ప్రముఖ వార్తా సంస్థ ఐఎన్ఏ నివేదించింది. అనేక మంది గాయపడ్డట్లు పేర్కొంది. ఐదు అంతస్తుల భవనంలో రాత్రిపూట మంటలు చెలరేగినట్లు ఐఎన్ఏ తెలిపింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మంటలు అదుపు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇప్పటి వరకూ తెలియరాలేదు. ప్రాథమిక దర్యాప్తు ఫలితాలు 48 గంటల్లో ప్రకటిస్తామని గవర్నర్ చెప్పినట్లు ఐఎన్ఏ నివేదించింది. ఈ ఘటన నేపథ్యంలో బిల్డింగ్, మాల్ యజమానిపై పలు కేసులు నమోదయ్యాయి. బిల్డింగ్ నుంచి మంటలు ఎగసిపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





# సత్యజిత్ రే ఇంటిని కూల్చలేదన్న బంగ్లాదేశ్

***టీపీఎన్, బంగ్లాదేశ్ :*** భారతదేశపు ప్రముఖ సినీ దర్శకుడు సత్యజిత్ రే పూర్వీకుల ఇంటి కూల్చివేతకు సంబంధించి బంగ్లాదేశ్ సీనియర్ అధికారి ఒకరు ఒక ప్రకటన విడుదల చేశారు. మైమెన్సింగ్‌లో కూల్చివేసిన ఇల్లు సత్యజిత్ రే కుటుంబానికి సంబంధించినది కాదని బంగ్లాదేశ్ అధికారి తెలిపారు.

మైమెన్‌సింగ్ డిప్యూటీ కమిషనర్ మోఫిదుల్ ఆలం, దర్యాప్తు తర్వాత స్థానిక యంత్రాంగం కూల్చివేసిన ఇంటికి సత్యజిత్ రే పూర్వీకులతో ఎటువంటి సంబంధం లేదని నిర్ధారించిందని ధృవీకరించారు.మైమెన్‌సింగ్‌లో కూల్చివేసిన ఇంటి వాస్తవికతను తెలుసుకోవడానికి బుధవారం మేము ఒక సమావేశం నిర్వహించామని ఆలం చెప్పారు. మేము స్థానిక ప్రజలతో కూడా మాట్లాడామని.. చారిత్రక పత్రాలను కూడా పరిశీలించాము. కూల్చివేసిన ఇంటిని మైమెన్‌సింగ్ చిల్డ్రన్ అకాడమీ కార్యాలయంగా ఉపయోగించారు. స్థానికంగా దుర్లోవ్ హౌస్ అని పిలువబడే సత్యజిత్ రే ఇల్లు మంచి స్థితిలో ఉందని .. దానిని తాకలేదని స్థానిక పరిపాలన ధృవీకరించింది. సత్యజిత్ రే పూర్వీకుల ఆస్తి చెక్కుచెదరకుండా ఉందని మాకు తెలిసిందని ఆలం అన్నారు. దాని ప్రస్తుత యజమానితో మేము మాట్లాడాము. అతను ఈ ఇంటిని సత్యజిత్ రే కుటుంబం నుండి నేరుగా కొనుగోలు చేశాడని.. దానిని నిరూపించడానికి అతని వద్ద అన్ని పత్రాలు ఉన్నాయని ధృవీకరించారు. కూల్చివేసిన ఇంటిని సత్యజిత్ రే పూర్వీకుల ఇల్లుగా తప్పుగా పరిగణించారు. సత్యజిత్ రే తాత, ప్రముఖ రచయిత ఉపేంద్ర కిషోర్ రే చౌదరి నిర్మించిన శతాబ్దం నాటి ఇల్లు ధ్వంసమైందని కొన్ని వార్తా కథనాలు వెలువడటంతో సత్యజిత్ రే నివాసానికి సంబంధించిన వివాదం చెలరేగింది. ఆ ఇల్లు శిథిలావస్థలో ఉంది.. దాదాపు ఒక దశాబ్దం పాటు ఉపయోగించకుండా పడి ఉంది. గతంలో ఇది మైమెన్సింగ్ శిశు అకాడమీని కలిగి ఉండేది కానీ తరువాత దానిని వదిలివేయబడింది. సత్యజిత్ రే ప్రపంచ సినిమా చరిత్రలో గొప్ప చిత్రనిర్మాతలలో ఒకరిగా పరిగణించబడ్డారు. ఆయన చిత్ర దర్శకుడిగానే కాకుండా రచయిత, సంగీతకారుడు , చిత్రకారుడు కూడా.

# పాకిస్తాన్‌లో బలవంతపు మతమార్పిడి



**టీపీఎన్, పాకిస్తాన్ :**
పాకిస్తాన్‌లో హిందూ మైనారిటీలపై వివక్ష .. దారుణాల వార్తలు కొత్త కాదు. సింధ్ ప్రావిన్స్‌లో, ముగ్గురు మైనర్ హిందూ బాలికలను కిడ్నాప్ చేసి బలవంతంగా మతం మార్చారు. వారి పేర్లు కూడా మార్చి, ఆ తర్వాత వారిని ముస్లిం అబ్బాయిలతో వివాహం చేశారు.భారతదేశ పొరుగున ఉన్న ఇస్లామిక్ దేశమైన పాకిస్తాన్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాల వార్తలు కొత్తేమీ కాదు. సింధ్ ప్రావిన్స్ లో హిందూ బాలికలను మతం మార్చి ముస్లిం అబ్బాయిలతో వివాహం చేస్తున్న కేసులు నిరంతరం వెలుగులోకి వస్తున్నాయి. సింధ్‌లోని తండో అల్లాయర్ జిల్లాలో ఒకేసారి మూడు కేసులు వెలుగులోకి వచ్చాయి, ఈ విషయంలో బాలికల కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. జూలై 13 ఆదివారం నాడు సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో మూడు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయబడ్డాయి. ఒకే పోలీస్ స్టేషన్‌లోని వివిధ ప్రాంతాల నుండి బాలికలను కిడ్నాప్ చేసి ముస్లిం అబ్బాయిలతో బలవంతంగా వివాహం చేశారని పేర్కొంది. ఆ బాలికలను మైనర్లు అని చెబుతున్నారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం ముగ్గురు బాలికలను ఖెంచ్చి కోల్హి, లతా మేఘవాధ్, మీనా మేఘవాధ్ లను కిడ్నాప్ చేసి ఆపై బలవంతంగా ఇస్లాంలోకి మార్చి, ఆ తర్వాత అదే రోజు ముస్లిం అబ్బాయిలతో వివాహం చేశారు.సింధ్‌లో హిందూ బాలికల మతమార్పిడిని వ్యతిరేకిస్తున్న కుటుంబ సభ్యులుపాకిస్తాన్ వార్తా పత్రిక 'ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' నివేదిక ప్రకారం కుటుంబ సభ్యులు బలవంతపు మతమార్పిడికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. కిడ్నాపర్లను వీలైనంత త్వరగా అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసుల వద్ద ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన తర్వాత, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ బయట కూర్చుని నిరసన తెలిపారు. కిడ్నాపర్లను అరెస్టు చేసే వరకు తమ నిరసనను విరమించబోమని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. కానీ ముగ్గురు బాలికలను కిడ్నాప్ చేసిన వారిని అరెస్టు చేస్తామని పోలీసులు వారికి హామీ ఇచ్చారు, అప్పుడే కుటుంబ సభ్యులు తమ నిరసనను విరమించారు.సింధ్ హైకోర్టులో కిడ్నాపర్లతో బాలికలు హాజరు మంగళవారం ముగ్గురు బాలికలు తమ కిడ్నాపర్లతో పాటు సింధ్ హైకోర్టు హైదరాబాద్ సర్క్యూట్ బెంచ్ ముందు హాజరయ్యారు. ముగ్గురు బాలికలు కోర్టు ముందు తమ స్వంత ఇష్టానుసారం ఇస్లాం మతంలోకి మారామని.. తమ ముస్లిం ప్రేమికులను వివాహం చేసుకున్నామని ప్రకటించారు. ముగ్గురు బాలికల హిందూ పేర్లు కూడా మార్చబడ్డాయి. వారికి కల్సూమ్ (ఖెంచి కోల్హి), బిస్మా (లతా మేఘవాధ్), సమైమా (మీనా మేఘవాధ్) అనే పేర్లు పెట్టారు. సింధ్ కోర్టు ముగ్గురు బాలికల భర్తలకు బెయిల్ మంజూరు చేసింది.సింధ్ మానవ హక్కుల కమిషన్ నిష్పాక్షిక దర్యాప్తుకు డిమాండ్సింధ్ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ దేతో జిల్లా ఎస్ఎస్పీకి ఒక లేఖ రాశారు. ఈ మూడు మతమార్పిడి కేసులపై న్యాయమైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. బాలికల వయస్సుకు సంబంధించి సరైన దర్యాప్తు జరగాలని లేఖలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. బాలికలు మైనర్లైతే, సింధ్ బాల్య వివాహ నిరోధక చట్టం 2013 ప్రకారం వారి వివాహం చట్టవిరుద్ధం అవుతుంది. సింధ్‌లో, హిందూ మైనారిటీ బాలికలను అపహరించడం, వారి బలవంతపు మతమార్పిడి తరువాత వివాహం చేయడం వంటి కేసులు పెరుగుతున్నాయి. పాకిస్తాన్‌లో పోలీసు యంత్రాంగం , ప్రభుత్వం మైనారిటీ హిందువులు , ఇతర మైనారిటీ వర్గాలపై వివక్ష చూపుతున్నాయని.. వారి హక్కులను విస్మరిస్తున్నాయని తరచుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి.

# లాభాల స్వీకరణతో సూచీల పతనం

**టీపీఎన్, ముంబై :**



ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడం, కొన్ని రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు దిగడం, భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టపోయాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ రంగాల్లో లాభాల స్వీకరణతో బెంచ్‌మార్క్ సూచీలు ఎరుపెక్కాయి. ఈ ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికం ఫలితాలూ విడుదలవుతుండటమూ ఇందుకు దోహదం చేసింది. మరోవైపు విదేశీ సంస్థాగత మదుపరులు వెళ్లిపోవడం చేటు చేస్తోంది. మొత్తంగా నిఫ్టీ 100, సెన్సెక్స్ 375 పాయింట్ల మేర పతనమయ్యాయి.

క్రితం సెషన్లో 82,634 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ గురువారం 82,753 వద్ద మొదలైంది. 82,219 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 82,757 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 375 పాయింట్ల నష్టంతో 82,259 వద్ద ముగిసింది. 25,230 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,101 వద్ద కనిష్ఠ, 25,238 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 100 పాయింట్ల పతనంతో 25,111 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 340 పాయింట్ల నష్టంతో 56,828 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ50లో 19 కంపెనీలు లాభపడగా 31 నష్టపోయాయి. టాటా కన్జూమర్, టాటా స్టీల్, హిందాల్కో, ట్రెంట్, టైటాన్ టాప్ గెయినర్స్. టెక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంకు, ఇన్ఫీ, ఎస్బీఐ లైఫ్, హెచ్‌సీఎల్ టెక్ అత్యధికంగా నష్టపోయాయి. నేడు రియాల్టి, మెటల్, కన్జూమర్ డ్యురబుల్స్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, ఎనర్జీ, హెల్త్‌కేర్, కమోడిటీస్ రంగాల సూచీలు స్వల్పంగా ఎగిశాయి. ఐటీ, పీఎస్‌యూ బ్యాంకు, ప్రైవేటు బ్యాంకు, ఫైనాన్స్, ఇన్ఫ్రా, ఆటో, చమురు రంగాల సూచీలు ఎరుపెక్కాయి.

ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ సెల్లర్లకే అనుకూలంగా ఉంది. మొత్తం 3023 స్టాక్స్ ట్రేడవ్వగా 1433 లాభపడ్డాయి. 1503 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 71 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 19 షేర్లు తాకాయి. అప్పర్ సర్క్యూటును 89, లోయర్ సర్క్యూటును 40 చేరాయి.

డాలరుతో పోలిస్తే రూపాయి 13 పైసలు బలహీనపడి 86.07 వద్ద స్థిరపడింది.

విప్రో క్యూ1 రూపీ రెవెన్యూ 1.6% తగ్గి రూ.22,080 కోట్లుగా ఉంది. ఎబిటా రూ.3927 కోట్ల నుంచి రూ.3813కోట్లకు తగ్గింది. యాక్సిస్ బ్యాంకు నికర లాభం రూ.5806 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ ఆదాయం రూ.13,560 కోట్లుగా ఉంది. జైడస్ లైఫ్ సైన్సెస్‌లో తనిఖీలు చేపట్టిన యూఎస్ఎఫ్‌డీయే బృందం ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపింది. హెరిటేజ్ ఫుడ్స్ నికర లాభం 30.7% తగ్గి రూ.58.4 కోట్ల నుంచి రూ.40.5 కోట్లకు చేరుకుంది. రూ.1555 టార్గెట్ ధరతో టెక్ మహీంద్రాకు మోర్గాన్ స్టాన్లీ అండర్ వెయిట్ రేటింగ్ కొనసాగించింది. పాలీక్యాబ్ ఇండియా నికర లాభం 49.4% వృద్ధిరేటుతో రూ.401 కోట్ల నుంచి రూ.600 కోట్లకు ఎగిసింది. వారీ రెన్యూవబుల్ నికర లాభం రూ.28.2 కోట్ల నుంచి రూ.86.4 కోట్లకు చేరింది. హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ నికర లాభం 24% వృద్ధిరేటుతో రూ.748 కోట్లకు చేరింది. ఆదాయం 25 శాతం వృద్ధి చెందింది. సౌతిండియా బ్యాంకు నికర లాభం 10% వృద్ధిరేటుతో రూ.294 కోట్ల నుంచి రూ.322 కోట్లకు ఎగిసింది.



**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**

## స్టాక్ రికమెండేషన్స్

**ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ :**
రియల్టీ రంగంలో కంపెనీ బలమైన స్థానం కలిగి ఉంది. 150 పూర్తయిన రెసిడెన్షియల్ ప్రాజెక్టులు, 37 కొనసాగుతున్న ప్రాజెక్టులతో మార్కెట్ కాప్ రూ. 74,357 కోట్లుగా ఉంది. ఈ షేర్లను రూ.1,7501,780 రేంజ్‌లో కొనుగోలు చేయాలి. బయ్ ఆన్ డిప్స్ మెథడ్ అనుసరించి హోల్డ్ చేసుకోవచ్చు. ఈ షేర్లు గురువారం రూ.1783 వద్ద ముగిశాయి.

**బర్జర్ పెయింట్స్:**
ఈ షేర్లను రూ. 550580 రేంజ్‌లో అక్యుములేట్ చేసుకోవాలి. పెయింట్స్ రంగంలో బలమైన డిమాండ్ వల్ల ఈ కౌంటర్లో స్థిరమైన వృద్ధికి అవకాశాలు ఉన్నాయి. ఈ షేర్లు గురువారం రూ.579 వద్ద ముగిశాయి.

**ఎస్కార్ట్స్ కుబోటా:**
ఆటోమొబైల్, వ్యవసాయ రంగంలో ఈ కంపెనీకి మంచి మార్కెట్ ఉంది. ఇన్వెస్టర్లు ఈ షేర్లను రూ. 3,550 టార్గెట్‌తో కొనుగోలు చేసి హోల్డ్ చేసుకోవాలి. ఈ షేర్లు గురువారం రూ.3,410 వద్ద ముగిశాయి.

**వెల్‌స్పన్ కార్ప్:**
ఈ షేర్లను రూ. 900 రేంజ్‌లో డిప్‌లో కొనుగోలు చేసి రూ. 1,150 టార్గెట్‌తో హోల్డ్ చేసుకోవచ్చు. Q1 2025లో నికర లాభం 3.5% పెరిగి రూ. 648 కోట్లకు, ఆదాయం 8.49% పెరిగి రూ. 3,966.86 కోట్లకు చేరింది. ఈ షేర్లు గురువారం రూ.931 వద్ద ముగిశాయి.

**టాటా స్టీల్:**
మదుపరులు ఈ కౌంటర్లో రూ. 150 రేంజ్‌లో ప్రవేశించాలి. రూ. 190210 టార్గెట్ వరకు హోల్డ్ చేయవచ్చు. స్టీల్ రంగంలో బలమైన డిమాండ్, ధరల స్థిరత్వం ఈ స్టాక్‌ను ఆకర్షణీయంగా మార్చింది. ఈ షేర్లు గురువారం రూ.159 వద్ద ముగిశాయి.

**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**




## డెరివేటివ్ కాంట్రాక్టుల కాలపరిమితి పెంపు!

**టీపీఎన్, ముంబై :**

రిటైల్ ఇన్వెస్టర్లను కాపాడేందుకు సెబీ మరో కీలక నిర్ణయం తీసుకోనుందని సమాచారం. ఈక్విటీ డెరివేటివ్స్ కాంట్రాక్టుల కాల పరిమితి, మెచ్యూరిటీని పొడగించే దిశగా ఆలోచిస్తోంది. డెరివేటివ్స్ మార్కెట్ నాణ్యతను మెరుగుపరచడం, స్థిరత్వాన్ని పెంపొందించడమే దీని లక్ష్యమని సెబీ సభ్యుడు అనంత్ నారాయణ్ తెలిపారు. స్వల్పకాలిక డెరివేటివ్స్ క్యాపిటల్ ఫార్మేషన్‌కు సాయపడవని, దీర్ఘకాలిక ఒప్పందాలు మార్కెట్‌ను స్థిరంగా మార్చగలవని ఆయన పేర్కొన్నారు.

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద డెరివేటివ్స్ మార్కెట్ అన్న సంగతి తెలిసిందే. ఏప్రిల్‌లో మొత్తం 7.3 బిలియన్ ఈక్విటీ డెరివేటివ్స్ నమోదవ్వగా అందులో 60% భారత్ నుంచే ఉన్నాయి. అయితే 202425 ఆర్థిక సంవత్సరంలో 91% రిటైల్ ట్రేడర్లు సగటున రూ. 1,10,069 నష్టపోయారని సెబీ అధ్యయనం గతంలో వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే డెరివేటివ్స్ కాంట్రాక్టుల సంఖ్యకు పరిమితి విధించి, లాట్ సైజులను పెంచడం తెలిసిందే. దీంతో కాస్ట్ పెరిగి రిటైల్ ట్రేడర్లు ఆసక్తి ప్రదర్శించరని భావించింది. కాగా తాజాగా డెరివేటివ్స్ మార్కెట్లో మోసం చేసిందన్న ఆరోపణలో అమెరికన్ కంపెనీ జేన్ స్ట్రీటుపై సెబీ చర్యలు తీసుకోవడం తెలిసిందే.

## ఐపీవోకు నెఫ్రోప్లస్: రూ.2000 కోట్లతో రానున్న హైదరాబాద్ కంపెనీ!

**టీపీఎన్, ముంబై :**

దేశంలోనే అతిపెద్ద డయాలసిస్ సేవల సంస్థలలో ఒకటైన నెఫ్రోప్లస్ పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతోంది. జులై నెలాఖరులో రూ.2,000 కోట్ల విలువైన ఐపీవో కోసం సెబీ వద్ద DRHP దాఖలు చేయనుందని తెలిసింది. ఈ నిధులతో భారత్ సహా విదేశాల్లోనూ వ్యాపారాన్ని విస్తరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం.

**ఐపీవో వివరాలు**

నెఫ్రోప్లస్ ఈ ఐపీవో ద్వారా సుమారు $200250 మిలియన్ (రూ. 2,127 కోట్లు) సమీకరించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా కొత్త షేర్ల జారీతో పాటు, ఇప్పటికే ఉన్న వాటాదారుల ఆఫర్ ఫర్ సేల్ సైతం ఉంటుంది. సంస్థ ఈ నిధులను భారత్‌లోని డయాలసిస్ కేంద్రాల విస్తరణ, మీడియం సైజ్ కంపెనీల విలీనం, విదేశీ మార్కెట్లలో వృద్ధికి ఉపయోగించనుంది. ఈ ఐపీవోను ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్, నొమురా, యాంబిట్ క్యాపిటల్ వంటి ప్రముఖ బ్యాంకులు మేనేజ్ చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

**నెఫ్రోప్లస్ సేవలు**

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న నెఫ్రోప్లస్ భారత్, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్థాన్‌లో 250కి పైగా నగరాలు, పట్టణాల్లో 450కి పైగా డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తోంది. ప్రముఖ ఆసుపత్రులతో కలిసి స్వతంత్ర క్లినిక్‌లు, పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (PPP) పద్ధతుల్లో సేవలు అందిస్తోంది. గత మూడేళ్లలో ఫిలిప్పీన్స్‌లో రాయల్ కేర్ డయాలసిస్ సెంటర్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఉజ్బెకిస్తాన్‌లో PPP బిడ్‌ను కైవసం చేసుకుంది. ఈ ఏడాది చివర్లో సౌదీ అరేబియాలోకి ప్రవేశించేందుకూ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**ఆర్థిక వివరాలు**

కొన్నేళ్లుగా నెఫ్రోప్లస్ ఆర్థిక పనితీరు మెరుగ్గా ఉంది. 2025 ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయం 39% వృద్ధిరేటుతో రూ. 749 కోట్లకు చేరింది. ఎబిటా మార్జిన్ 22.5 శాతానికి మెరుగైంది. ఇండియా రేటింగ్స్ ఈ మధ్యే "IND A+/Positive" రేటింగ్ ఇవ్వడం గమనార్హం. నిరుడు హెల్త్‌కేర్‌కేంద్రీకృత ప్రైవేట్ ఈక్విటీ సంస్థ క్వాడ్రియా నెఫ్రోప్లస్‌లో రూ. 850 కోట్ల పెట్టుబడి పెట్టింది. ఈ నిధులను ఆయా మార్కెట్లలో విస్తరణకు కంపెనీ ఉపయోగించింది. 2030 నాటికి భారత డయాలసిస్ మార్కెట్ 6.5 సీఏజీఆర్‌తో $870కు చేరుకుంటుందని అంచనా. ప్రస్తుతం భారత్ వ్యవస్థీకృత మార్కెట్లో ఈ కంపెనీకి 50 శాతానికి పైగా వాటా ఉండటం గమనార్హం.

# విప్రో నికర లాభం 11%వృద్ధి: ఒక్కో షేరుకు రూ. 5 డివిడెండ్




**టీపీఎన్, ముంబై :**

విప్రో లిమిటెడ్ 202526 తొలి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 11% పెరిగి రూ. 3,330 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ. 3,003 కోట్లుగా ఉంది. ఆదాయం 2.65% పెరిగి రూ. 22,079.7 కోట్లకు చేరగా, గత ఏడాది రూ. 21,509.3 కోట్లుగా నమోదైంది. కంపెనీ ఒక్కో షేరుకు రూ. 5 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. రికార్డ్ డేట్ జూలై 25. చెల్లింపు తేదీ ఆగస్టు 6, 2025. ఐటీ సేవల ఆదాయం రూ. 22,080 కోట్లుగా ఉంది. ఎబిటా మార్జిన్ 17.3%కి మెరుగైంది.

**HDFC AMC Q1 రిజల్ట్: నికర లాభంలో 24%, ఆదాయంలో 25% వృద్ధి**

HDFC అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (HDFC AMC) 202526 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక (ఏప్రిల్‌జూన్ 2025) ఫలితాలను గురువారం ప్రకటించింది. కంపెనీ నికర లాభం 24% పెరిగి రూ. 748 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ. 604 కోట్లుగా ఉంది. గత త్రైమాసికం (మార్చి 2025) రూ. 638.73 కోట్లతో పోలిస్తే 17% వృద్ధి నమోదైంది. ఆదాయం 25% పెరిగి రూ. 968 కోట్లకు చేరగా, గత ఏడాది ఇది రూ. 775 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం 26.5% పెరిగి రూ. 948 కోట్లకు చేరింది. జూన్ 2025లో క్వార్టర్లీ యావరేజ్ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (QAAUM) మార్కెట్ షేర్ 11.5%గా నమోదైంది.

**యాక్సిస్ బ్యాంకు**
**నికర లాభం రూ. 5,806 కోట్లు**

తొలి త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంక్ బ్యాంక్ నికర లాభం 4% తగ్గి రూ. 5,806 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ. 6,035 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 0.8% పెరిగి రూ. 13,560 కోట్లకు చేరింది. గ్రాస్ నాన్‌పెర్ఫార్మింగ్ అసెట్స్ (GNPA) 1.57%కి, నెట్ NPA 0.45%కి పెరిగాయి. ప్రొవిజన్స్ రూ. 3,947 కోట్లకు చేరాయి. గత ఏడాదితో పోలిస్తే 97% ఎక్కువ. ఆపరేటింగ్ ప్రాఫిట్ 14% పెరిగి రూ. 11,515 కోట్లకు చేరింది. డిపాజిట్లు 13%, లోన్లు 14% వృద్ధి చెందాయి.

**ఫలితాల అండతో**
**14% పెరిగిన ఇక్సిగో షేర్లు**

ఇక్సిగో (లే ట్రావెన్యూస్ టెక్నాలజీ) షేర్లు జూన్ 2025 త్రైమాసికంలో బలమైన ఫలితాల తర్వాత 14.27% పెరిగి NSEలో రూ. 209 వద్ద 52వారాల గరిష్ఠ స్థాయికి చేరాయి. ఆదాయం 73% పెరిగి రూ. 314.5 కోట్లకు, నికర లాభం 27% పెరిగి రూ. 19 కోట్లకు చేరింది. గ్రాస్ ట్రాన్సాక్షన్ వాల్యూ (GTV) 55% పెరిగి రూ. 4,644.7 కోట్లకు చేరగా, ఫ్లైట్ మరియు బస్సు GTV 81%, ట్రైన్ GTV 30% వృద్ధి చెందాయి. EBITDA 69% పెరిగి రూ. 32.5 కోట్లకు, అడ్జస్టెడ్ EBITDA 54% పెరిగి రూ. 31.4 కోట్లకు చేరింది. AIఆధారిత ఆవిష్కరణలు, జెన్ Z మరియు సోలో మహిళా యాత్రికుల డిమాండ్ వృద్ధి కంపెనీ విజయానికి కారణమని నిర్వాహకులు తెలిపారు.

# డార్క్ వెబ్ ప్రపంచం

ఇంటర్ నెట్ లో సీక్రెట్ అండ్ అన్ అఫిషియల్ డిపార్ట్ మెంట్ డార్క్ వెబ్ గా చెబుతాం. వీటి గురించి సైబర్ డిపార్ట్ మెంట్ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తుంటుంది. అలాగే చాలా సినిమాల్లో కూడా క్లియర్ గా చెబుతుంటారు. మామూలు సెర్చ్ ఇంజిన్లకు ఇది చిక్కదు. దీన్ని యాక్సెస్ చేయాలంటే ప్రత్యేకమైన టూల్స్ లేదా బ్రౌజర్లు కావాలి. సాధారణంగా ఫైర్‌ఫాక్స్, గూగుల్, యాహూ వంటి ఓపెన్ వెబ్ బ్రౌజర్లు ఐపీ అడ్రస్‌ల ద్వారా యూజర్ల పనులను పర్యవేక్షిస్తాయి. అదే డార్క్ వెబ్‌లో యూజర్ల ఐడెంటిటీ తెలియదు. సీక్రెట్ గా ఉండాలని కోరుకునేవారికిది ఓ రక్షణ స్థావరాన్ని సృష్టిస్తుంది. ఈ ఇంటర్నెట్ రహస్య, అదృశ్య భాగం 90ల్లోనే స్టార్ట్ అయ్యింది. అమెరికా నేవల్ రిసెర్చ్ లేబరేటరీ అప్పట్లో ద ఆనియన్ రూటింగ్ ప్రాజెక్ట్ ప్రైమరీ వర్షన్‌తోనే దీనికి పునాది పడింది. పేరుకు తగ్గట్టుగా ఇది ఉల్లి పొరల మాదిరిగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లో టెక్నికల్ మెసేజ్ లను పొందుపరుస్తుంది. ఇంటర్నెట్ లో వచ్చే ప్రభుత్వ సమాచారాలను రక్షించటం దీని ఉద్దేశం. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఆన్‌లైన్ గోప్యతను మరింత కట్టుదిట్టం చేసే లక్ష్యంతో రోజర్ డింగెల్‌డైన్, ఆయన టీమ్ టోర్‌ను రూపొందించింది. ఇది స్వచ్ఛంద ఆపరేటెడ్ సర్వర్ల ద్వారా ఆన్‌లైన్ ట్రాఫిక్‌ను మళ్లిస్తుంది. డేటాను ఎన్‌క్రిప్ట్ చేయటం ద్వారా యూజర్ చిరునామాను దాచి పెడుతుంది. మొదట్లో మంచి ఉద్దేశం కోసం రూపొందించినప్పటికీ క్రమంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకోవటం ఎక్కువైంది. అక్రమ సరుకులు, సైబర్ నేరాల వంటి పనులకు ప్రసిద్ధి పొందింది. అక్రమ కార్యకలాపాలకు పెట్టింది పేరైనా డార్క్‌వెబ్ విశ్వసనీయ పనులకూ ఉపయోగపడుతోంది. స్పై, రిపోర్టర్స్ రహస్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవటానికి దీన్ని వాడుకుంటుంటారు. సెక్యూర్ డ్రాప్ వంటి వేదికలు సీక్రెట్ గా లీకులు ఇవ్వటానికి అవకాశమిస్తాయి. సోర్సుల వివరాలు బయటకు పొక్కనీయవు. ఇంటర్నెట్ సెన్సార్‌షిప్ అధికంగా ఉండే దేశాల్లో నిషేధిత సమాచార ప్రసారానికి డార్క్



వెబ్ జీవధారలా పనిచేస్తుంది. తమ డేటాను కాపాడుకోవటానికి కొన్ని ఆసుపత్రులు, ఇతర సంస్థలు సైతం దీన్ని వాడుకుంటున్నాయి. అయితే ఈ అజ్ఞాత ధోరణే సైబర్ నేరాలకు అవకాశం ఇస్తుంది. బ్లాక్ మార్కెట్ కు హెల్ప్ చేస్తుంది. మత్తు పదార్థాలు, దొంగ నోట్లు, మాల్వేర్ లావాదేవీలకు ఆస్కారం కల్పిస్తోంది. దొంగిలించిన ఆర్థిక సమాచారం, హ్యాకింగ్ టూల్స్ అమ్మకాలూ అక్కడ వెల్లువెత్తుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా చట్టపరమైన సంస్థలు డార్క్ వెబ్ వ్యవహారాలనూ ఓ కంట కనిపెడుతుంటాయి. కానీ అధునాతన ఎన్‌క్రిప్షన్ పద్ధతుల మూలంగా నేరగాళ్లను గమనించటం పెద్ద సమస్యగా నిలుస్తోంది. అయినప్పటికీ అధునాతన విధానాలతో పోలీసులు నేరగాళ్లను పట్టుకుంటున్నారు. కేరళ వ్యక్తి ఉదంతమే దీనికి నిదర్శనం. సాధారణంగా టోర్‌ను డౌన్‌లోడ్ చేసుకొని డార్క్ వెబ్‌ను ఉపయోగించుకుంటారు. ఇది నోడ్స్ అని పిలుచుకునే పలు సర్వర్ల ద్వారా కనెక్షన్లను దారి మళ్లిస్తుంది. టోర్ వీటిని ప్రపంచవ్యాప్తంగా రాండమ్ గా సెలెక్ట్ చేసుకుంటుంది. ప్రతి దశలోనూ డేటాను సీక్రెట్ కోడ్ లోకి మారుస్తుంది. అందువల్ల డార్క్ వెబ్‌లో జరిగే వ్యవహారాలను పట్టుకోవటం దాదాపు అసాధ్యమనే చెప్పుకోవచ్చు. ఈ చీకటి అంతర్జాలంలో వెబ్‌సైట్లు ".onion" డొమైన్లను వాడుకుంటాయి. సంప్రదాయ సెర్చ్ ఇంజిన్ల సూచికల్లో ఇవి ఉండవు. టోర్ యూజర్ తరఫున వెబ్ పేజీలను సెర్చ్ చేయదు. యూజరే సొంతంగా డార్క్ వెబ్ పేజీలను వెతుక్కోవాల్సి ఉంటుంది. మార్కెట్ ప్లేసెస్, వేదికలు, చివరికి లైబ్రరీలూ డార్క్ వెబ్‌లో ఉంటాయి. కానీ మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, దొంగిలించిన డేటా అమ్మటానికి.. హ్యాకింగ్ సర్వీసులకే ఎక్కువగా వాడుకుంటుంటారు.




# స్ట్రెస్ మేనేజ్ మెంట్ ఎలా అంటే?

కొన్ని పరిస్థితులు మన జీవితాన్ని అనుకోని మలుపులు తిప్పుతాయి. ఆ పరిస్థితులకు కొందరు కుంగిపోతే.. మరికొందరు ధైర్యంగా ఎదుర్కొని ఇతరులకు మార్గదర్శులుగా మారతారు. అలాంటి వ్యక్తే మహారాష్ట్రకు చెందిన ఫిజియోథెరపిస్ట్, అనుజా లునియా. స్ట్రెస్ కారణంగా జీర్ణసంబంధ వ్యాధి, ఐబిడికి గురైన అనుజా.. స్ట్రెస్ స్ట్రాటజిస్ట్‌గా మారి ఎంతో మందికి ఒత్తిడిని దూరం చేస్తున్నారు. ఆ ప్రయాణం ఆమె మాటల్లోనే తెలుసుకుందాం. మాది మహారాష్ట్రలోని థానే.. అమ్మానాన్న ఇద్దరూ డాక్టర్లు. వాళ్లను చూస్తూ పెరగడం వలన నేనూ డాక్టర్‌ను అవ్వాలనుకున్నా. అనుకున్నట్లే ఫిజియోథెరపిస్ట్ ను అయ్యాను. సంతోషంగా ప్రొఫెషనల్ లైఫ్ ను స్టార్ట్ చేశాను. అంతా ఆనందంగా సాగిపోతున్న సమయంలో జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్ బారిన పడ్డాను. ఎన్నో మందులు వాడాను. కానీ వాటి రిజల్ట్ టెంపరరీ. జీవనశైలి మారితేనే ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుందని అనిపించింది. ఈ ఆలోచనకు కార్యరూపం ఇవ్వడంతో పరిస్థితిలో మార్పు కనిపించింది. దాంతో ఓవైపు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే మరో పక్క కెరీర్ మీద ఫోకస్ చేశా. మళ్లీ జీవితం సాధారణ స్థితికి వచ్చింది. కొత్త జీవితం మొదలైనట్టు అనిపించింది. కానీ ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. కొన్నాళ్లకే ఐబీడీ తిరబెట్టింది. ఏమీ తినకలేక పోయేదాన్ని. తీవ్రమైన కడుపు నొప్పి, నీరసంతో బాధపడ్డాను. దాదాపు 16 కిలోల బరువు కోల్పోయాను. యోగా, ధ్యానం ప్రయత్నించినా కోలుకోలేకపోయా. అప్పుడే ఈ సమస్యకు ప్రధాన కారణం ఒత్తిడేనని గుర్తించాను. ఎంతో పరిశోధన చేసి ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఓ ప్లానింగ్ ను రెడీ చేసుకుని పాటించాను. ఆ సమయంలో మా అమ్మానాన్నలు కొండంత అండగా నిలిచారు. దాంతో ఒత్తిడిని, నా అనారోగ్యాన్ని కూడా జయించగలిగాను. ఈ రోజుల్లో ఒత్తిడి ఓ సాధారణ సమస్యగా మారిపోయింది. కానీ ఒత్తిడి.. మధుమేహం, హైపర్ టెన్షన్, పీసీఓఎస్ వంటి అనేక అనేక రోగాలకు మూలం. నాడీ వ్యవస్థను ఒత్తిడి తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మా అమ్మానాన్నలు వైద్య వృత్తిలో ఉండడం వలన ఒత్తిడి నియంత్రణలో ఎంతో సహకారం అందించారు. కానీ అందరికీ అలాంటి పరిస్థితులు ఉండవు. అందుకే నాలా ఒత్తిడి వల్ల ఎవరూ ఇబ్బంది పడకూడదని రిలాక్స్.. ప్లే.. థ్రైవ్ అనే బుక్ రాశాను. ఇందులో ఒత్తిడిని కంట్రోల్ చేయడానికి యాక్టివిటీస్, పజిల్స్ వంటివి ఉంటాయి. అలాగే ఇందులోని క్యూఆర్ కోడ్‌ల ద్వారా గైడెడ్ ఆడియో, వీడియో కంటెంట్ అందుబాటులో ఉంటుంది. ఒత్తిడి వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు సామాజిక సమస్య. మన దేశంలో 77 శాతం జనాభా ఒత్తిడితో బాధపడుతోంది. అందుకే ఒత్తిడి నియంత్రణపై అనేక వర్క్ షాప్ లు నిర్వహిస్తున్నా. కొవిడ్ సమయంలో కార్పొరేట్ కంపెనీల్లో వర్క్‌షాప్ లు కండక్ట్ చేశానని అన్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 125 పైగా వర్క్ షాప్ లు నిర్వహించాను. భారత దేశాన్ని ప్రపంచంలోనే ఒత్తిడి తక్కువ ఉన్న దేశంగా మార్చాలన్నదే నా లక్ష్యం.

# ఐక్యూ.. 32MP 4K సెల్ఫీ కెమెరాతో లాంచ్

ఐక్యూ అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ లాంచ్ డేట్ కన్ఫర్మ్ చేసిన కంపెనీ ఈ ఫోన్ కీలకమైన ఫీచర్స్ కూడా తెలిపింది. ఈ ఫోన్ ను బౌండ్ లెస్ AMOLED అండ్ 32MP 4K సెల్ఫీ కెమెరాతో లాంచ్ చేస్తున్నట్లు ఐక్యూ తెలిపింది. ఈ ఫోన్ యొక్క మరిన్ని కీలకమైన ఫీచర్స్ కూడా ఐకూ టీజర్ ద్వారా బయట పెట్టింది. ఈ అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ ఫీచర్స్ స్పెషాలిటీస్ ఏంటో ఇప్పుడు చూద్దాం. ఐక్యూ జెడ్ 10 ఆర్ స్మార్ట్ ఫోన్ జూలై 24న ఇండియన్ మార్కెట్లో లాంచ్ అవుతుంది. ఈ ఫోన్ అమెజాన్ స్పెషల్ గా వస్తుంది అంతేకాకుండా ఈ ఫోన్ లాంచ్ తర్వాత అమెజాన్ నుంచి సేల్ అవుతుంది. అందుకే, అమెజాన్ ఈ ఫోన్ కోసం ప్రత్యేకమైన టీజర్ పేజి అందించింది టీజింగ్ చేస్తోంది. ఈ టీజర్ పేజీ నుంచి ఈ ఫోన్ యొక్క కీలకమైన ఫీచర్స్ తో ఈ ఫోన్ టీజింగ్ చేస్తోంది. ఐకూ స్మార్ట్ ఫోన్ యొక్క డిజైన్, డిస్ప్లే అండ్ కెమెరా గురించి కంపెనీ కీలకమైన వివరాలు వెల్లడించింది. కంపెనీ ప్రకారం, ఈ ఫోన్ కేవలం 7.39mm అల్ట్రా స్లీక్ డిజైన్ తో ఉంటుంది. ఈ ఫోన్ చాలా సన్నగా ఉన్నా కూడా ఈ ఫోన్ లో భారీ 5700 mAh బ్యాటరీ అందించడం విశేషంగా చెబుతోంది. ఈ ఫోన్ మరింత సన్నగా కనిపించేలా మరియు ఈ ఫోన్ మరింత సుందరంగా మార్చేలా ఈ ఫోన్ బౌండ్ లెస్ AMOLED స్క్రీన్ అందించింది. ఈ స్క్రీన్ స్మూత్ గా నడిచేలా 120Hz రిఫ్రెష్ రేట్ ను కూడా



కలిగి ఉంటుంది. ఈ ఫోన్ లో ప్రజంట్ జనరేషన్ కి తగ్గట్లుగా, సమర్ధవంతమైన కెమెరా సెటప్ అందించినట్లు ఐక్యూ చెబుతోంది. ఇందులో వెనుక 50MP సోనీ IMX882 మెయిన్ కెమెరా కలిగిన డ్యూయల్ రియర్ కెమెరా సెటప్ మరియు ముందు 32MP 4K సెల్ఫీ కెమెరా ఉన్నట్లు కంపెనీ కన్ఫర్మ్ చేసింది. అంటే, ఈ ఫోన్ రియర్ అండ్ సెల్ఫీ కెమెరా తో కూడా 4K వీడియో షూట్ చేసే అవకాశం ఉంటుంది. ఇది మాత్రమే కాదు ఈ ఫోన్ ను IP 68 అండ్ IP 69 రేటింగ్ తో లాంచ్ చేస్తున్నట్లు కూడా ప్రకటించింది. అంటే, ఈ ఫోన్ మంచి డస్ట్ అండ్ వాటర్ రెసిస్టెంట్ గా కూడా ఉంటుంది. ఈ ఫోన్ ఇమేజ్ ద్వారా ఈ ఫోన్ లో డ్యూయల్ స్టీరియో స్పీకర్లు ఉన్నట్లు కూడా అర్ధం అవుతుంది. ఐక్యూ జెడ్ 10 ఆర్ స్మార్ట్ ఫోన్ ను రూ. 20,000 రూపాయల బడ్జెట్ ధరలో అందించే అవకాశం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, కంపెనీ ఈ ఫోన్ ప్రైస్ అఫిషియల్ గా అనౌన్స్ చేసే వరకు మనం వేచి చూడాల్సిందే.

# అదృష్టం అంటే ఇతనిదే.. రూ.6 టికెట్ కొంటే రూ.కోటి లాటరీ..



నక్క తోక తొక్కడం అంటే ఇదేనేమో. రూ.6 పెట్టి టికెట్ కొంటే ఏకంగా కోటి రూపాయల లాటరీ తగిలింది. అది కూడా ఓ డైలీ వేజ్ కూలీని లాటరీ వరించింది. పంజాబ్‌లోని మోగా జిల్లాలో ఈ అద్భుతం చోటు చేసుకుంది. రోజువారీ కూలీ జాస్మాయిల్ సింగ్ అనే వ్యక్తికి ఈ జాక్‌పాట్ తగలడంతో రాత్రికి రాత్రే కోటీశ్వరుడు అయ్యాడు. ఇటుక బట్టీలో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్న జాస్మాయిల్, ఫిరోజ్‌పూర్ జిల్లాలోని జిరాను సందర్శించేటప్పుడు ఈ లక్కీ టికెట్‌ను కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన కొన్ని గంటల తర్వాత, అతనికి జీవితాన్ని మార్చే ఫోన్ కాల్ వచ్చింది. శర్మ జీ ఫోన్ చేసి, మీ నంబర్‌ను చెక్ చేయండి, మీరు రూ.1 కోటి గెలుచుకున్నారు అని అన్నారు. దీంతో ఒక్కసారిగా ఇది నిజమేనా అని ఆశ్చర్యపోయాను అని జాస్మాయిల్ వివరించాడు. ఈ వారం స్టార్టింగ్ లో మధ్యాహ్నం 1:00 గంటల ప్రాంతంలో విజేత టికెట్ డ్రా తీశారు. ఆనందంతో ఉప్పొంగిపోయిన జాస్మాయిల్ అండ్ అతని కుటుంబం తమ గ్రామంలో స్వీట్లు పంపిణీ చేస్తూ, డ్రమ్స్ వాయిస్తూ, నృత్యం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ డబ్బు అన్నింటికీ అర్థం, అని జాస్మాయిల్ అన్నారు. నేను దీన్ని రూ. 25 లక్షల రుణం తీర్చడానికి అలాగే నా పిల్లల భవిష్యత్తు కోసం ఉపయోగిస్తానని లాటరీ విజేత ప్రకటించారు. ఆయన భార్య వీర్పాల్ కౌర్ కూడా అంతే ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి రోజును మేము ఎప్పుడూ ఊహించలేదు. మేము చాలా సంతోషంగా ఉన్నాము. ఇప్పుడు మేము, మా పిల్లలం మంచి జీవితాన్ని అందించగలమని కౌర్ తెలిపారు. కాగా ప్రజంట్ ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

# డయాబెటిక్ పేషెంట్స్‌కి నేచురల్ రెమెడీస్

ప్రజంట్ లైఫ్ స్టైల్ లో చిన్న పిల్లల దగ్గర్నుండి పెద్దవాళ్ల వరకు చాలామందిలో డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు ఉన్నారు. డయాబెటిస్ అనేది ఒక దీర్ఘకాలిక వ్యాధి. దీనిని పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదు, కానీ ఆహారం ద్వారా దానిని కంట్రోల్ చేయొచ్చు. కాబట్టి, ఈ వ్యాధితో బాధపడేవారు రక్తంలో షుగర్ ను కంట్రోల్ లో ఉంచడానికి తమ ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అయితే, చక్కెర స్థాయిని అదుపులో ఉంచడానికి కొన్ని గ్రీన్ జ్యూస్‌లు మీకు సహాయపడతాయి. ఆ జ్యూస్‌లు ఏవో ఇప్పుడు చూద్దాం. మునగ రసం షుగర్ పేషెంట్స్ కి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నిర్వహించడంలో సహాయపడతాయి. ఇందులో ఉండే పోషకాలు శరీరంలో ఇన్సులిన్ మొత్తాన్ని పెంచడంలో సహాయపడతాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్ లో ఉంచుతుంది. నెక్స్ట్ మధుమేహ రోగులకు కాకరకాయ రసం ఒక ఔషధం లాంటిది. ఇందులో విటమిన్‌సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. కాకరకాయ రసంలో పాలీపెప్టైడ్‌పి ఉంటుంది. ఇది ఇన్సులిన్ లాంటి మూలకం. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. పాలకూర రసం తీసుకోవడం మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేయడంలో సహాయపడతాయి. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. దీన్ని తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. పాలకూర రసం తాగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ప్రమాదం తగ్గుతుందని అనేక అధ్యయనాలు కనుగొన్నాయి. సొరకాయ రసంలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీని గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉంటుంది. కాబట్టి దీని వినియోగం రక్తంలో చక్కెరను పెంచదు. దీనితో పాటు, ఇందులో పుష్కలంగా ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. దీని వినియోగం జీర్ణ సంబంధిత సమస్యలను కూడా తొలగిస్తుంది. డయాబెటిస్ రోగులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి కలబంద రసం తీసుకోవచ్చు. ఇందులో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీని రెగ్యులర్ వినియోగం మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది.





# దూసుకొస్తున్న భారత్ బోల్ట్

క్రికెట్.. హాకీ.. బ్యాడ్మింటన్.. నీరజ్ చోప్రా రాకతో ఈమధ్య కాలంలో జావెలిన్ త్రోలో ఇండియా పేరు విశ్వవేదికపై మార్మోగిపోతోంది. కానీ, అథ్లెటిక్స్‌లో మాత్రం ఆసియా క్రీడల వరకే మనోళ్ల విజయాలు పరిమితం అయ్యాయి. కరణం మల్లీశ్వరీ, పీటి ఉష.. అంజూ బీజార్జ్.. కుంజరాణి వంటి వారు దేశ ప్రతిష్టను పెంచినా.. ఆ తర్వాతి తరం వీళ్ల వారసత్వాన్ని అందిపుచ్చుకోలేకపోయింది. అవినాష్ సబ్లే, పరుల్ చౌదరీ, జ్యోతి ఎర్రాజీలు ఫర్వాలేదనిపిస్తున్నా ట్రాక్ అండ్ ఫీల్డ్ మీద చిరుతలా పరుగెత్తి పతకాలు కొల్లగొట్టే అథ్లెట్లు కరువయ్యారు. అయితే.. అనిమేశ్ కుజుర్ రూపంలో భారత్‌కు ఉసేన్ బోల్ట్ లాంటి పరుగుల స్టార్ దొరికాడు. బుల్లెట్ వేగంతో పరుగులు తీస్తూ నేషనల్ లెవెల్ లో రికార్డులు బద్దలు కొడుతున్న ఈ యువకెరటం.. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిక్స్ మీద ఫోకస్ పెట్టాడు. ఈ పోటీలకు అర్హత సాధించాడంటే అనిమేశ్ చరిత్ర సృష్టించడం ఖాయం. ట్రాక్ మీద రాకెట్ వేగంతో దూసుకెళ్లే అనిమేశ్ కుజుర్‌ది ఛత్తీస్‌గఢ్ లోని మారుమూల గ్రామం. ఆరడుగుల రెండు అంగుళాల పొడవుండే ఇతడు టీనేజ్ నుంచే తన స్పీడ్‌తో అందర్నీ సర్ప్రైస్ చేస్తున్నాడు. ఈమధ్యే 100 మీటర్ల దూరాన్ని 10.18 సెకన్లలో చేరుకొని చరిత్ర సృష్టించాడు. తద్వారా గురిందెర్వీర్ పేరిట ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టి ది ఫాస్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా అవతరించాడు అనిమేశ్. 22 ఏళ్లకే దేశం గర్వించదగ్గ అథ్లెట్ గా మారిన అతడు ఈమధ్యే మొనాకో డైమండ్ లీగ్ లో పోటీపడ్డాడు. అండర్ 23 విభాగంలో 200 మీటర్ల పరుగులో ఆస్ట్రేలియా స్టార్ గౌట్ గౌట్‌తో పోటా పోటీగా పరుగు తీసి ఔరా అనిపించాడు అనిమేశ్. అయితే.. సెకన్లో పదో వంతుతో పోడియం మీద నిల్చొనే అవకాశం కోల్పోయాడు. అయినా సరే.. అతడేమీ నిరాశకు లోనవ్వడం లేదు. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో అంతర్జాతీయ వేదికలపై భారతీయ జెండాను రెపరెపలాడించేందుకు మరింత గట్టిగా ప్రయత్నించేందుకు సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతానికి సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ టోర్నీని లక్ష్యంగా పెట్టుకున్నాడు అనిమేశ్. తన వేగంతో నేను కచ్చితంగా క్వాలిఫై అవుతాను కోచ్. మీరు ఏమీ కంగారు పడకండి అని అనిమేశ్ ఆత్మ విశ్వాసంతో చెబుతున్నాడు.



## జపాన్ ఓపెన్‌లో సాత్విక్, చిరాగ్‌కు షాక్

టోక్యోలో గురువారం జరిగిన 5 న రెండో రౌండ్ లో చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్, వాంగ్ చాంగ్ చేతిలో భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ మెన్స్ డబుల్స్ జోడీ.. సాత్విక్, చిరాగ్ శెట్టి ఓడిపోయారు. దీంతో వీరు జపాన్ సూపర్ 750 టోర్నమెంట్ నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో అయిదో సీడ్ చైనా జంటపై 44 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో భారత జోడీ 2224, 1421 తేడాతో ఓడిపోయింది. ఈ ఫలితంతో, పారిస్ ఒలింపిక్స్ రజత పతకం విజేతలు వీ కెంగ్, వాంగ్ చాంగ్ భారత జట్టుపై తమ హెడ్‌టు హెడ్ రికార్డును 72కి పెంచుకున్నారు. కాగా ఈ ఘటనతో భారత్ నిరాశకు గురైంది.

## కోచ్‌గా సాహా సెకండ్ ఇన్నింగ్స్!



భారత మాజీ క్రికెటర్ వృద్ధిమాన్ సాహా సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయనున్నాడు. ఆరు నెలల క్రితమే ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అతడు త్వరలోనే కోచ్‌గా అవతారం ఎత్తనున్నాడు. దేశవాళీలో, ఐపీఎల్‌లో సుదీర్ఘ అనుభవం కలిగిన సాహా బెంగాల్ అండర్ 23 జట్టుకు కోచ్‌గా సేవలందించనున్నాడు. ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా చెరగని ముద్ర వేసిన అతడితో ఒప్పందం చేసుకునేందుకు బెంగాల్ క్రికెట్ సంఘం ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. అయితే.. బీసీసీఐ, క్యాబ్ మాజీ అధ్యక్షుడు, సౌరభ్ గంగూలీ నుంచి అతడికి పోటీ ఎదురవుతోంది. అండర్ 23 జట్టుకు కొత్త కోచ్ కోసం వెతుకున్నాం. ఈ నేపథ్యంలోనే వచ్చే వారం క్యాబ్ అధికారులు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రస్తుతానికి కోచ్ పదవికి వృద్ధిమాన్ సాహా పేరు పరిశీలనలో ఉంది. అయితే.. సౌరభ్ గంగూలీ, పంకజ్ రాయ్‌లు కూడా రేసులో ఉన్నారు. ఈ ముగ్గురిలో కోచ్‌గా బాధ్యతలు చేపట్టేది ఎవరు? అనేది త్వరలోనే తెలియనుంది అని క్యాబ్ సీనియర్ అధికారి తెలిపాడు. బ్యాటర్, వికెట్ కీపర్ అయిన సాహా భారత జట్టు తరఫున 40 టెస్టు మ్యాచ్‌లు, 9 వన్డేలు ఆడాడు. 2021లో జట్టుకు దూరమైన సాహా ఆ తర్వాత ఐపీఎల్‌కే పరిమితం అయ్యాడు. గుజరాత్ టైటాన్స్ తరఫున అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన అతడిని 18వ సీజన్‌కు ముందు గుజరాత్ వదిలించుకుంది. రంజీ ట్రోఫీలో బెంగాల్ లీగ్ దశలోనే వదిలివేయడంతో జనవరిలో ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడీ బెంగాల్ స్టార్. ఇక ఫిబ్రవరిలో మూడు ఫార్మట్ల నుంచి వీడ్కోలు పలికాడీ వెటరన్ ప్లేయర్. తరువాత కోచింగ్ మీద దృష్టి సారించిన సాహా యువతకు మెలకువలు నేర్పిస్తున్నాడు. అందుకే.. అండర్ 23 జట్టుకు క్యాబ్ అతడిని కోచ్‌గా నియమించాలనే ఉద్దేశంతో ఉంది. ఇకపోతే.. సీనియర్ జట్టుకు మాజీ కెప్టెన్ లక్ష్మీ రతన్ శుక్లా ప్రధాన కోచ్‌గా, అండర్ 19 జట్టుకు స్పిన్నర్ సౌరాశిష్ లహిరి కోచ్‌గా వ్యవహరించనున్నారు.

# అభిమన్యుకి అవకాశమివ్వాలి: మాజీ క్రికెటర్




ఇంగ్లాండ్, భారత జట్టు మధ్య నాలుగో టెస్ట్ మ్యాచ్ జులై 23 నుంచి మాంచెస్టర్ వేదికగా జరగనుంది. ఈ సిరీస్ లో భాగంగా ఇప్పటివరకు మూడు టెస్ట్ మ్యాచ్లు జరగ్గా లీడ్స్, లార్డ్స్ టెస్ట్లో ఇంగ్లాండ్ విజయం సాధించింది. బర్మింగ్ హమ్ టెస్ట్ లో టీమిండియా గెలిచింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ 21తో ముందంజలో ఉంది. దీంతో మాంచెస్టర్లో జరగనున్న మ్యాచ్లో టీమిండియా కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి. నేపథ్యంలో భారత జట్టుపై క్రికెట్ విశ్లేషకులు, అభిమానుల నుంచి పలు విమర్శలు వస్తున్నాయి. అభిమన్యు ఈశ్వరన్ కు ఫైనల్ టీమ్ లో అవకాశం ఇవ్వాలని టీమిండియా మాజీ క్రికెటర్, టీమ్ ఇండియా ఉమెన్స్ మాజీ కోచ్ వూర్కేరి వెంకట్ రామన్ అంటున్నారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. అభిమన్యు ఈశ్వరన్ భారత ఫైనల్ టీమ్ లో కచ్చితంగా స్థానం కల్పించాలి. అతడికి వరుసగా కొన్ని అవకాశాలు ఇవ్వాలి. ఈ దిశగా కోచ్ గౌతం గంభీర్, సెలెక్టర్లు ఆలోచించాలి. ఫైనల్ టీమ్ లో స్థానం ఇవ్వనప్పుడు అతన్ని స్క్వాడ్ లో కొనసాగించడంలో అర్థం లేదు. టీమిండియా తరఫున చాలా క్రికెట్ మ్యాచ్లు ఆడాడు అని రామన్ అన్నాడు.

# తొక్కిసలాటకు ఆర్సీబీనే కారణం: కర్ణాటక ప్రభుత్వం




ఐపీఎల్‌లో ఫస్ట్ ట్రోఫీ నెగ్గిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు లో తలపెట్టిన విజయోత్సవ ర్యాలీలో తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. సుమారు 50 మంది వరకూ గాయపడ్డారు. ఇక ఈ ఘటనపై కర్ణాటక ప్రభుత్వం సంచలన నివేదికను హైకోర్టుకు సమర్పించింది. ఈ రిపోర్ట్‌లో ఆర్సీబీని సిద్ధరామయ్య ప్రభుత్వం నిందించింది. తొక్కిసలాటకు ఆర్సీబీనే కారణమని పేర్కొంది. విజయోత్సవ పరేడ్ విషయంలో ఆర్సీబీ యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరించిందని ఆరోపించింది. పోలీసులను సంప్రదించకుండా పెద్ద ఎత్తున అభిమానులను ఈవెంట్‌కు ఆహ్వానించినట్లు పేర్కొంది. ఈ మేరకు హైకోర్టులో నివేదిక సమర్పించింది. అయితే, ఈ రిపోర్ట్‌ను సీక్రెట్‌గా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఈ నివేదిక గోప్యతకు ఎలాంటి చట్టపరమైన కారణాలు లేవని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం సమర్పించిన రిపోర్ట్‌ను కోర్టు ఆదేశాల మేరకు బహిరంగంగా విడుదల చేశారు. విజయోత్సవ పరేడ్ కోసం ఆర్సీబీ యాజమాన్యం కేవలం సమాచారం మాత్రమే ఇచ్చిందని ప్రభుత్వం పేర్కొంది. నిబంధనల ప్రకారం ఈవెంట్‌కు ఎలాంటి అనుమతులూ కోరలేదని తెలిపింది. ఐపీఎల్‌లో విజయం తరువాత ఆర్సీబీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో విక్టరీ పరేడ్ గురించి పోస్టు పెట్టినట్లు తెలిపింది. చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఈ వేడుకకు ఉచిత ప్రవేశమని ప్రకటించింది. దీంతో స్టేడియం సామర్థ్యానికి మించి 3 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఇలాంటి ఈవెంట్‌ల కోసం కనీసం ఏడు రోజుల ముందే అనుమతులు తీసుకోవాలని ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. నిర్వాహకులు సరైన ప్రణాళికలు లేకపోవడం, సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం అందించడంలో విఫలం కావడం వల్లే తొక్కిసలాట జరిగిందని ప్రభుత్వం తెలిపింది.



# స్పిరిట్ పై ట్రిప్తి కామెంట్స్

స్పిరిట్ కాస్టింగ్ సెలెక్షన్ విషయంలో దీపికతో సందీప్ వంగా మధ్య వచ్చిన గొడవల గురించి సినీ ఇండస్ట్రీలో చాలా చర్చ సాగుతోంది. దీపిక యారొగెన్సీ కారణంగా అవకాశం కోల్పోయిందని చాలా మంది భావిస్తున్నారు. ఇది కేవలం ఎనిమిది గంటల పనిదినం లేదా అదనపు పారితోషికం, లాభాల్లో వాటా కోరడం వంటి చిన్న విషయాలే కాదు... అంతకు మించి దీపిక ఫెమినిజాన్ని, బాసిజాన్ని ప్రదర్శించి చివరికి గొప్ప అవకాశం కోల్పోయిందని చెబుతున్నారు. ఇదిలా ఉండగానే పుండు మీద కారం చల్లినట్టు ఇప్పుడు ట్రిప్తి దిమ్రీ లైన్ లో కొచ్చింది. ఈ బ్యూటీ చాలా సింపుల్ గా స్పిరిట్ గురించి ఒక కామెంట్ చేసింది. స్పిరిట్ బ్యూటిఫుల్ ఫిలిం.. ఇందులో నేను నటిస్తున్నాను అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం మరో సౌత్ హీరో విశాల్ సరసన నటిస్తున్నాని పేర్కొన్న ట్రిప్తి దిమ్రీ, ఆ సినిమా రిలీజ్ కి వస్తున్నందున దానిపైనే పూర్తిగా దృష్టి పెట్టానని తెలిపింది. ఆ తర్వాత వంగాస్ స్పిరిట్ లో నటిస్తున్నానని తెలిపిన ట్రిప్తి, ఇది బ్యూటిఫుల్ ఫిలిం అని పేర్కొంది. ఇదివరకూ వచ్చిన స్టోరీస్ ప్రకారం.. సెప్టెంబర్ లో స్పిరిట్ షూటింగ్ ప్రారంభం కానుంది. నిర్మాత ప్రణయ్ వంగా ఇప్పటికే దీనిని ఫిక్స్ చేసారు. ఇక లేటెస్ట్ ఇంటర్వ్యూలో దీపిక ఎగ్జిట్ కి కారణం ఏమిటో ప్రస్థావించకుండానే .. బ్యూటిఫుల్ ఫిలింలో దీపిక అవకాశం కోల్పోయిందని చెప్పకనే చెప్పింది ట్రిప్తి దిమ్రీ. ఇక ప్రభాస్ హీరోగా నటిస్తున్న స్పిరిట్ మూవీపై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ముఖ్యంగా ఈ సినిమాలో ప్రభాస్ రోల్ చాలా పవర్ ఫుల్ గా ఉండబోతుంది. కాప్ గెటప్ లో కనిపించబోతున్నారు.











# 2025 సెకండాఫ్ లో 10 పాన్ ఇండియా ప్రాజెక్ట్స్

సినిమా అంటే కేవలం ఎంటర్ టైన్ మెంట్ మాత్రమే కాదు.. అదొక ఎమోషన్. అందుకే ఇండియాలో సగం బిజినెస్ లు సినిమా ఇండస్ట్రీపైనే ఆధారపడ్డాయి. 2025 ఫస్టాఫ్ ఇప్పటికే కంప్లీట్ అయింది. బాక్సాఫీస్ వద్ద వివిధ సినిమాలు రిలీజ్ అవ్వగా.. కొన్ని హిట్స్ గా నిలిచాయి. మరికొన్ని ఫ్లాప్స్ గా మారాయి. ఇప్పుడు సెకండాఫ్ స్టార్ట్ అయ్యింది. ఎన్నో సినిమాలు రిలీజ్ కు రెడీ అవుతున్నాయి. ఒక్క నవంబర్ తప్ప నెలకు కనీసం ఒక్క పాన్ ఇండియా మూవీ అయినా ఎంటర్ టైన్ చేయనుంది. మరి ఆ సినిమాలేంటి? ఎప్పుడు రిలీజ్ అవుతున్నాయి? అనేది ఇప్పుడు తెలుసుకుందాం. ప్రజంట్ జులై నెల విషయానికొస్తే.. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటిస్తున్న హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ కానుంది. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఆ సినిమా జులై 24న విడుదల అవ్వనుంది. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు నాటి స్టోరీతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా మూవీ సందడి చేయనుంది. ఆ తర్వాత ఆగస్టులో రెండు పాన్ ఇండియా సినిమాలు బిగ్ క్లాష్ కు రెడీ అవుతున్నాయి. అవేంటంటే.. కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీ మూవీ, టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ వార్2 సినిమాలు.. ఆగస్టు 14న రిలీజ్ కానున్నాయి. రెండింటినీ యాక్షన్ డ్రామాలుగా లోకేష్ కనగరాజ్, అయాన్ ముఖర్జీ రూపొందించారు. ఇక సెప్టెంబర్ లో వివిధ పాన్ ఇండియా సినిమాలు విడుదలవుతున్నాయి. యంగ్ హీరో తేజ సజ్జా అప్ కమింగ్ మూవీ మిరాయ్ సెప్టెంబర్ 5న రిలీజ్ కానుంది. ఆ తర్వాత నటసింహం బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ సినిమాలు అఖండ 2, ఓజీ సెప్టెంబర్ 25న విడుదలవుతున్నాయి. బోయపాటి శ్రీను, సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఆయా సినిమాలపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అక్టోబర్ లో స్టార్ హీరో రిషబ్ శెట్టి తన సూపర్ హిట్ సినిమా కాంతారా ప్రీక్వెల్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. కాంతారా: చాప్టర్ 1 తో అక్టోబర్ 2న సందడి చేయనున్నారు. నవంబర్ లో ఎలాంటి పాన్ ఇండియా రిలీజ్ లేనప్పటికీ.. డిసెంబర్ ఫస్ట్ వీక్ లో పాన్ ఇండియా ప్రభాస్ రాజా సాబ్ తో థియేటర్స్ లోకి రానున్నారు. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా డిసెంబర్ 5న రిలీజ్ కానుంది. అదే రోజు రణవీర్ సింగ్ దురంధర, షాహిద్ కపూర్ సినిమాలు కూడా రానున్నాయి. క్రిస్మస్ స్పెషల్ గా యంగ్ హీరో అడివి శేష్ డెకాయిట్ తో పాటు అవతార్3 విడుదల కానుంది. వీటితోపాటు మరికొన్ని సినిమాలు కూడా వచ్చే ఛాన్స్ ఉంది. సో ఈ సెకండాఫ్ లో రిలీజ్ అయ్యే సినిమాలన్నీ ఓ రేంజ్ లో హై ఎక్స్ పెక్టేషన్ ఉన్న సినిమాలే కావడం హైలెట్. మరి వీటిల్లో ఏ మూవీ ఎలాంటి రిజల్ట్ ను ఇస్తుందో చూడాలి.

# అనుపమ పరదా ఎప్పుడంటే?

అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా వస్తున్న సినిమా పరదా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే టీజర్, ఫస్ట్ సింగిల్ తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, డిఫరెంట్ కాన్సెప్ట్ తో వస్తోందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. సినిమా బండి దర్శకుడు ప్రవీణ్ కందరగుల ఈ సినిమాతో మరోసారి ఎమోషన్స్, సామాజిక అంశాలను హైలెట్ చేస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమాకు సంబంధించి లేటెస్ట్ గా రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాలో అనుపమతో పాటు దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టీజర్ లో కనిపించిన వారి యాక్టింగ్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. అనుపమ ఒక పల్లెటూరి అమ్మాయిగా.. సంప్రదాయాల నేపథ్యంలో సాహసయాత్ర సాగించాల్సి వచ్చే కాన్సెప్ట్ తో ఈ సినిమా సాగనుంది. గ్రామీణ నేపథ్యంలో నడిచే ఈ సినిమా వినూత్న కథను అందించబోతోంది. తాజాగా విడుదలైన పోస్టర్‌లో అనుపమ లుక్ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. సంప్రదాయ దుస్తుల్లో ఆమె లుక్‌తో పాటు, వెనుక భాగంలో దేవత విగ్రహం కనిపించేలా పోస్టర్ డిజైన్ చేశారు. ఈ పోస్టర్‌లోనే విడుదల తేదీ కూడా ప్రకటించారు. రాబోయే ఆగస్టు 22న పరదా సినిమాను విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు తెలిపారు. అలాగే విడుదల చేసిన యత్ర నార్యాస్తు అనే పాటకు కూడా మంచి స్పందన వస్తోంది. ఈ పాటను సంగీత దర్శకుడు గోపీసుందర్ కంపోజ్ చేశారు. వినూత్న సంగీతం, అర్థంతో కూడిన సాహిత్యం, అన్నీ కలిసి ఈ సినిమాలోని పాటలను మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. ఫోక్ డాన్సులు, సాంప్రదాయ కళలతో ఈ పాటను తెరకెక్కించిన విధానం కూడా వినూత్నంగా ఉంది. ఈ పాటలో వినిపించే ఉత్సాహభరితమైన టోన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతుంది. పరదా సినిమా స్టోరీ, కాన్సెప్ట్, హీరోయిన్స్ క్యారెక్టర్ల ఇంపార్టెన్స్.. ఇవన్నీ కలిసి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలిపే హైలెట్స్. ముఖ్యంగా శ్రావణ మాసం సందర్భంగా కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు వస్తారు కాబట్టి ఆగస్టు 22న రిలీజ్ డేట్ చాలా సరైన ఛాయిస్ గా మారింది. అనుపమ నటనకు ఇప్పటికే మార్కెట్‌లో క్రేజ్ ఉంది. ఆమె ఈ సినిమాలోని పాత్రతో మరోసారి తన నటనను నిరూపించుకునే అవకాశం ఉంది. ఈ సినిమాని విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువా కలిసి ప్రొడ్యూస్ చేస్తున్నారు.





# స్ట్రేంజర్ థింగ్స్ సీజన్ 5 ట్రైలర్

ఓటీటీ పుణ్యమా అని సినిమాల కన్నా వెబ్ సిరీస్ లపై క్రేజ్ ఎక్కువగా మారింది. అందుకే ఆయా ఓటీటీ ఓనర్లు ఒరిజినల్ సిరీస్ లు ప్లాన్ చేయడంలో ముందుంటున్నారు. వీటిల్లో టాప్ పొజిషన్ లో ఉన్న ఓటీటీ నెట్ ఫ్లిక్స్. ఎక్కడెక్కడో టాప్ మూవీ డైరెక్టర్స్ ని తీసుకొచ్చి మరీ నెట్ ఫ్లిక్స్ సంస్థ ఒరిజినల్ వెబ్ సిరీస్ లను తెరకెక్కిస్తుంది. వీటిల్లో మోస్ట్ ఇంట్రెస్టింగ్ జానర్ అంటే సస్పెన్స్ థ్రిల్లర్ జానర్ అనే అనాలి. అలా నెట్ ఫ్లిక్స్ లో స్ట్రేంజర్ థింగ్స్ అనే వెబ్ సిరీస్ కు ఓ రేంజ్ లో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఈ సిరీస్ వరల్డ్ వైడ్ ఓటీటీ కంటెంట్ లో సెన్సేషనల్ హిట్ గా నిలిచింది. అయితే ఇప్పుడు స్ట్రేంజర్ థింగ్స్ సీజన్ 5 స్ట్రీమింగ్ కు రెడీ అవుతంది. ఇప్పటికే స్ట్రేంజర్ సిరీస్ కు సంబంధించిన నాలుగు సీజన్లు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కించుకున్నాయి. ఇప్పుడు సీజన్ 5పై భారీ అంచనాలు ఉన్నాయి. సైన్స్ తో పాటు ఫాంటసీ థ్రిల్లర్ గా రూపొందిన ఆ సిరీస్ లో సీజన్ 5 చివరిది కాబోతుందని మేకర్స్ అనౌన్స్ చేయడంతో.. లాస్ట్ సీజన్ కోసం ఈగర్ గా అంతా వెయిట్ చేస్తున్నారు. విజువల్ వండర్ గా ఉండబోతున్న ఆ సిరీస్.. దశలవారీగా విడుదల అవుతుంది. వాల్యూమ్ 1 నవంబర్ 26న ప్రీమియర్ అవుతుంది, వాల్యూమ్ 2 డిసెంబర్ 25న స్ట్రీమింగ్ కోసం అందుబాటులో ఉంటుంది. చివరగా డిసెంబర్ 31న సందడి చేయనుంది. ప్రస్తుతం సీజన్ 5 పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అయితే సీజన్ 5 లో మిల్లీ బాబీ బ్రౌన్, విన్నారైడర్, డేవిడ్ హార్బర్, ఫిన్ వోల్ఫ్‌హార్డ్, గేటెన్ మాటరాజ్జో, కాలేబ్ మెక్‌లాఫ్లిన్, నోహ్ ష్నా, సాడీ సింక్ సహా మరికొంత మంది కొత్త యాక్టర్స్ కనిపించబోతున్నారు. నెల్ ఫిషర్, జేక్ కాన్నెల్లీ, అలెక్స్ బ్రూక్స్, లిండా హామిల్టన్ తదితరులు సీజన్ 5లో ఎంటర్ టైన్ చేయనున్నారు. ఇప్పుడు మేకర్స్ టీజర్ రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ వస్తోంది. సిరీస్ లవర్స్ ను ఆకట్టుకుని మెప్పిస్తోంది. సిరీస్ భయానకంగా, భావోద్వేగపరంగా గాఢంగా ఉంటుందని హామీ ఇస్తుంది. దీంతో ఈ టీజర్ తర్వాత మాత్రం అంచనాలు మరింత పెరగడమే కాకుండా.. సిరీస్ కు ఒక పర్ఫెక్ట్ ముగింపుగా కూడా నిలుస్తుందనే చెప్పాలి. ఎమోషనల్ గ్రావిటీ, ఎపిక్ సినిమాటిక్ స్కేల్, దెయ్యాల వాతావరణాలు, నీడ లాంటి రాక్షసులు, భావోద్వేగకరమైన కలయికలు, ఉత్కంఠభరితమైన సౌండ్ ట్రాక్, అద్భుతమైన వీఎఫ్ఎక్స్, అద్భుతమైన సినిమాటోగ్రఫీ.. అలా టీజర్ లో అన్నీ అంచనాలు పెంచుతున్నాయి. కొన్ని విజువల్స్ ఊహకు అందని విధంగా ఉన్నాయి. మరి సిరీస్ ఎలా ఉంటుందో.. ఎలా మెప్పిస్తుందో తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

# హరిహర వీరమల్లు ప్రీరిలీజ్ ఈవెంట్ పై ట్విస్ట్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన లాంగ్ అవైటెడ్ సినిమానే హరిహర వీరమల్లు. పీరియాడిక్ నేపథ్యంలో తెరకెక్కించిన ఈ సినిమాని దర్శకులు క్రిష్ ఆలాగే జ్యోతికృష్ణ రెండు భాగాలుగా ప్లాన్ చేశారు. అయితే ఈ సినిమాకి పడినంత బ్రేక్స్ మరో సినిమాకి పడలేదని చెప్పొచ్చు. ఇలా ఫైనల్ గా థియేటర్స్ లో బ్లాస్ట్ అయ్యేందుకు వస్తున్న సినిమాకి ముందు గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. అయితే మీదట అవుట్ డోర్ లో భారీగా ప్లాన్ చేద్దామనుకున్న ఈవెంట్ తిరుపతి నుంచి విశాఖకు చేరుకుంది. కానీ ఇప్పుడు కొత్త ట్విస్ట్ ఏంటంటే ఈ రెండు చోట్ల కూడా కాదు హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించనున్నట్టుగా ఇప్పుడు రూమర్స్ వినిపిస్తున్నాయి. దీనితో ఈ సినిమా రిలీజ్ కి ముందే ఇన్ని టర్న్ లు తీసుకోవాల్సి వస్తుందని చెప్పాలి. ఇక థియేటర్స్ లో రిలీజ్ అయ్యాక ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ సినిమాపై మళ్లీ భారీ స్థాయిలో అంచనాలు క్రియేట్ అయిన సంగతి తెలిసిందే.

